తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 193 | బుధవారం 04 –12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in

# హైదరాబాద్ వైపు..
# ప్రపంచం చూపు!

- హైదరాబాద్‌ను టోక్యో, న్యూయార్క్ నగరాలతో పోటీ పడేలా చేస్తాం
- హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్న సీఎం
- ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మిస్తున్నామని వెల్లడి
- కాంగ్రెస్ వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారం 29 శాతం పెరిగిందన్న సీఎం



**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే హైదరాబాద్ అద్భుత నగరం అవుతుందని, టోక్యో, న్యూయార్క్ నగరాలతో పోటీ పడేలా చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రైజింగ్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రూ.7 వేల కోట్లతో నగరంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, ఫ్లైఓవర్లు, నాలాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజాపాలన కోసం తెలంగాణ ప్రజలు ఏడాది క్రితం తీర్పునిచ్చారని, తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. మెట్రో రైలును హైదరాబాద్ తీసుకు వచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని వెల్లడించారు. రూ.35 వేల కోట్లతో 360 కిలో మీటర్ల రీజినల్ రింగ్ రోడ్డుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌ను నిర్మించబోతున్నామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అబద్ధాలతో పదేళ్లు గడిపేశారని ఆరోపించారు.

మిగతా 2లో


# కొత్త చట్టాలు జాతికి అంకితం చేసిన మోదీ

- బానిసల కోసం చేసిన చట్టాలు మనకెందుకు
- చండీగఢ్ లో కొత్త చట్టాలు 100శాతం అమలు
- కొత్త చట్టాలతో ప్రజలకు మేలు జరుగుతుంది
- డిజిటల్ ఆధారాలు, టెక్నాలజీ ఏకీకరణ.
- ఉగ్రవాదంపై పోరాడేందుకు మరింత ఈజీ
- బ్రిటీష్ నాటి కాలం నుంచి బయటపడాలి:మోదీ

**తెలంగాణ ముచ్చట్లు,నేషనల్ బ్యూరో :**



నూతనంగా తీసుకువచ్చినమూ డు నేర చట్టాలను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. మంగళవారం చండీగఢ్ లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ ప్రక టన చేశారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరికను రక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమ్ చట్టాలను జులై ఒకటో తేదీ నుంచి అమలు చేస్తు న్నారు. బ్రిటీష్ కాలం నాటి ఇం డియన్ పీనల్ కోడ్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ అండ్ ద ఇం డియన్ ఎవిడెన్స్ యాక్టు చట్టాలను కేంద్ర సర్కార్ రద్దు చేసింది.కొత్త మూడు న్యాయ చట్టాలను వందశాతం అమలు చేసిన రాష్ట్రంగా చండీగర్ నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలు, ప్రాముఖ్యత కు లోటు రాకుండా భారతీయ న్యాయ సంహిత రూపొందించిన ట్లు తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆశయాల దిశగా అడుగులు వేసేందుకు కొత్త క్రిమినల్ చట్టాల ను ఉపయోగపడుతాయన్నారు. కొత్త చట్టాలతో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. డిజిటల్ ఆధారాలు, టెక్నాలజీ ఏకీకరణతో.. ఉగ్రవాదంపై పో రాడేందుకు సులువుఅవుతుంద ని, ఉగ్రవాదులు.. ఉగ్రసంస్థలు తప్పించుకోలేని రీతిలో కొత్త చట్టాలు పకడ్బందీగా ఉన్నట్లు ప్రధాని తెలిపారు. బానిసల కోసం చట్టాలను మనం ఎందుకు అమలు చేయాలని ప్రధాని ప్రశ్నించారు. బ్రిటీష్ కాలం నాటి మైండ్సెట్ నుంచి దేశ ప్రజలు బయట పడాలన్నారు.



## ఒక జిల్లా..ఒకే ఉత్పత్తి (ఓడీఓపీ) అమలు పరిస్థితి ఏమిటి..?

- జిల్లా-నిర్దిష్ట ప్రణాళికను రూపొందించడంలో రాష్ట్రాల పాత్ర వివరాలేంటి..?
- రైతులు, మధ్యతరహా పారిశ్రామికవేత్తలకు ఏం ప్రయోజనాలు జరుగుతున్నాయి..?
- లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

మిగతా 2లో

## కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగింది

- 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ నగర అభివృద్ధికి పది పైసలు ఖర్చు చేయలేదు
- జికాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్ నగర అభివృద్ధి జరిగింది
- జిమూసీని జీవ నదిగా మార్చాలని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నది

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**




ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నేడు ఎన్టీఆర్ మార్గ్ లో నిర్వహించిన హైదరాబాద్ రైజింగ్ సభలో పాల్గొన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మూసీ పరివాహక ప్రాంతంలో ఒక్క రోజు కాదు నువ్వు, నీ కుటుంబం గుడిసె వేసుకొని జీవించి చూపించన్నారు. ప్రజలను మభ్య పెట్టడానికి ఒక రోజు మూసి తీరంలో నిద్ర చేసి తర్వాత విలాసమైన ప్యాలెస్ లో ఉండటం సరికాదని, మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజల జీవితాలు బాగుపడటం బీఆర్ఎస్‌కి ఇష్టం లేదన్నారు. 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ నగర అభివృద్ధికి పది పైసలు ఖర్చు చేయలేదన్నారు భట్టి విక్రమార్క.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్ నగర అభివృద్ధి జరిగిందని, మూసిని జీవ నదిగా మార్చాలని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నదన్నారు భట్టి విక్రమార్క. ఢిల్లీ లాంటి ముప్పు రావొద్దని కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నదని, దేశం గర్వించే విధంగా హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయబోతున్నామన్నారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా హైదరాబాద్ ను మార్చాలన్న సంకల్పంతో ప్రణాళికలు రూపొందించామని, నక్లెస్ రోడ్డులో జరిగిన తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అటవీ అనుమతులు

- ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అటవీ అనుమతులు
- మెదక్ జిల్లాలో 35.5882 హెక్టార్లు
- సిద్దిపేట జిల్లాలో 28.2544 హెక్టార్లు
- యాదాద్రి-భువనగిరి జిల్లాలో 8.511 హెక్టార్లు
- మంత్రిత్వశాఖ మంజూరీ చేసినట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.



**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించిన అటవీ అనుమతులను కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ మంజూరీ చేసినట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన సమాచారాన్ని కేంద్ర అటవీ శాఖ అసిస్టెంట్ ఇన్ స్పెక్టర్ జనరల్ కైలాష్ భీమ్ రావ్ భవర్, ఐఎఫ్ఎస్ లేఖ రూపంలో తెలియజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పంపిన లేఖలో రీజినల్ రింగ్ రోడ్డు (ఉత్తర భాగానికి) కు ప్రధాన సమస్యగా ఉన్న అటవీ భూములకు సంబంధించిన అనుమతులను ఇస్తూ.. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అటవీ అనుమతుల కోసం తెలంగాణ ప్రభుత్వం 26.07.2024 తేదీన పంపించిన FP/TG/ROAD/489876/2024 ఆన్‌లైన్ ప్రతిపాదనలను ఆమోదించేందుకు అటవీ సంరక్షణ చట్టం 1980 లోని సెక్షన్ ‘2’ ప్రకారం పరిశీలించడమే కాకుండా కేంద్రప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టం 1980

మిగతా 2లో

# తాజ్‌మహల్‌కు బాంబు బెదిరింపు

- పర్యాటక శాఖకు ఈ మెయిల్ ద్వారా బెదిరింపు
- బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించిన పోలీసులు
- గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు మెయిల్

**తెలంగాణ ముచ్చట్లు,నేషనల్ బ్యూరో :**



భారత ప్రముఖ పర్యాటక ప్రదేశం, 17వ శతాబ్దపు స్మారక చిహ్నం తాజ్ మహల్‌కు బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. పర్యాటక శాఖకు ఈ బెదిరింపు మెయిల్ వచ్చింది. తాజ్ మహల్‌ను బాంబులతో పేల్చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు హెచ్చరించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తాజ్ మహల్ వద్దకు బాంబ్ డిస్పోజల్ టీమ్‌లను, డాగ్ స్క్వాడ్స్‌ను రంగంలోకి దింపి తనిఖీలు నిర్వహించారు.తాజ్ మహల్‌ను పేల్చివేస్తామని బెదిరింపు ఈమెయిల్ వచ్చిందని ఆగ్రా డీసీపీ సూరజ్ రాయ్ వెల్లడించారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తాజ్ మహల్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువును గుర్తించలేదన్నారు. కాగా, బెదిరింపు మెయిల్ రాగానే పర్యాటకులను బయటకు పంపించి తనిఖీ చేశారు.

# హైడ్రాకు భారీగా నిధులు విడుదల

- నగరంలోని చెరువులు, కుంటలు, పార్కుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా
- హైడ్రాకు తెలంగాణ ప్రభుత్వం భారీ నిధులు
- హైడ్రా కార్యాలయ నిర్వహణకు, వాహనాల కొనుగోలుకు రూ.50 కోట్ల నిధులు విడుదల

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

హైదరాబాద్ నగరంలోని చెరువులు, కుంటలు, పార్కుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా (HYDRA) కు తెలంగాణ ప్రభుత్వం భారీ నిధులు కేటాయించింది. మంగళవారం, హైడ్రా కార్యాలయ నిర్వహణకు, వాహనాల కొనుగోలుకు రూ.50 కోట్ల నిధులు విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైడ్రా ఆవిర్భావం తరువాత జీహెచ్ఎంసీ(GHMC) పరిధిలోని పలు చెరువులు, కుంటలు ఆక్రమణల నుండి విముక్తి పొందాయి. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి నగరంలోని పర్యావరణాన్ని కాపాడేందుకు ఈ సంస్థ నిరంతర శ్రమ చేస్తోంది.ప్రత్యేక బిల్లు, విస్తృత అధికారాలు హైడ్రాకు

మిగతా 2లో





## వర్గీకరణను వ్యతిరేకించే వారందరినీ శత్రువులుగా చూస్తాం

- మంద కృష్ణ మాదిగ

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

వర్గీకరణను వ్యతిరేకించే వారందరినీ తాము శత్రువులుగానే చూస్తామని

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
బుధవారం 04 –12–2024


# హైడ్రాకు భారీగా నిధులు విడుదల

మొదటి పేజీ తరువాయి



మరింత శక్తివంతమైన అధికారాలు ఇవ్వడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ద్వారా హైడ్రా అనేక విస్తృత అధికారాలను పొందుతూ, చెరువుల రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను అధునాతన సాంకేతిక పద్ధతులు, వాహనాల కొనుగోలు, కార్యాలయ నిర్వహణకు ఉపయోగించనున్నారు. ఈ నిధులు హైడ్రా పనితీరుకు మరింత బలం చేకూరుస్తాయి. ఈ చొరవతో చెరువుల సంరక్షణ, పర్యావరణ రక్షణలో హైదరాబాద్ నగరం దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# వర్గీకరణను వ్యతిరేకించే వారందరినీ శత్రువులుగా చూస్తాం

మొదటి పేజీ తరువాయి



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను ఏ పార్టీ వ్యతిరేకించడం లేదని, ఎవ్వరూ అడ్డుకోలేరని అన్నారు. మాలలను భ్రమలో పెట్టకుండా, పక్కదారి పట్టించకుండా మీకు చేతనైతే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలో చేరండి లేదా మీరే ఒక పార్టీ పెట్టుకోండని ఆయన అన్నారు. వర్గీకరణను వ్యతిరేకించే వారు రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని పిలుపునిచ్చారు. మాలలది తొండి ఆట అని, వారు సైకోలుగా మారారని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు, రిజర్వేషన్లకు ఇంకా అడ్డు తగులుతామని చెప్పే మనువాదులకి సామాజిక న్యాయం దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు..



# ముగిసిన ఏపీ క్యాబినెట్ సమావేశం..

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ సమావేశం
- వివిధ ప్రభుత్వ పాలసీలకు మంత్రివర్గం ఆమోదం
- బియ్యం అక్రమ రవాణా అంశంపై చర్చ
- జల్ జీవన్ మిషన్ ఆలస్యం కావడంపై సీఎం చంద్రబాబు అసంతృప్తి

**తెలంగాణ ముచ్చట్లు**

సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ క్యాబినెట్ సమావేశం ముగిసింది. పలు రంగాల్లో ప్రభుత్వ విధానాలకు ఈ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఏపీ మారిటైమ్ పాలసీ, టెక్స్ టైల్స్ గార్మెంట్ పాలసీ, ఐటీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ (4.0)లకు రాష్ట్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. అంతేకాదు... పులివెందుల, ఉద్ధానం, డోన్ తాగునీటి ప్రాజెక్టులను క్యాబినెట్ ఆమోదించింది. హోమియోపతి, ఆయుర్వేద ప్రాక్టీషనర్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణకు కూడా నేటి సమావేశంలో ఆమోదం లభించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గిరిజన గృహ పథకం అమలు, ఇంటిగ్రేటెడ్ టూరిజం పాలసీ, క్రీడా విధానంలో మార్పులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఈ క్యాబినెట్ భేటీలో బియ్యం అక్రమ రవాణా అంశం కూడా చర్చించారు. ప్రభుత్వానికి ఈ మాఫియా సవాల్ గా మారిందని, దీనికి అడ్డుకట్ట వేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. కాకినాడ పోర్టులో అరబిందో సంస్థ 41 శాతం వాటాను లాగేసుకుందని ఆరోపించారు. ఆస్తులు గుంజుకోవడం వైసీపీ హయాంలో ట్రెండ్ గా మారిందని వ్యాఖ్యానించారు. ఇక, కేంద్ర ప్రభుత్వ పథకం జల్ జీవన్ మిషన్ పథకం రాష్ట్రంలో అమలు చేయడంలో ఆలస్యం జరుగుతుండడం పట్ల చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ వంటి ప్రాధాన్య పథకం ఇంకా డీపీఆర్ స్థాయిని దాటకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, తాగునీటి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కూడా మాట్లాడారు. జల్ జీవన్ మిషన్ ను ఏపీ సద్వినియోగం చేసుకోవడంలేదని ఢిల్లీలో కూడా చెప్పుకుంటున్నారని వెల్లడించారు. అధికారుల ఉదాసీనత వల్లే ఈ పథకం ఆలస్యమవుతోందని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేశ్ కూడా ఈ పథకంపై స్పందించారు. ఇది అందరికీ చేరువయ్యే భారీ ప్రాజెక్టు అని... దీన్ని మిషన్ మోడ్ లో ముందుకు తీసుకెళ్లడం ద్వారా అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని స్పష్టం చేశారు.

# దక్షిణ కొరియాలో సైనిక పాలన..!

**తెలంగాణ ముచ్చట్లు**



అమెరికా మిత్రపక్షం దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోయల్ మంగళవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశంలో అత్యవసర సైనిక పాలన విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర కొరియా పట్ల సానుభూతి ప్రదర్శిస్తూ విపక్ష పార్టీలు పరిపాలనకు అడ్డం పడుతున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన టీవీ చానెల్ ద్వారా జాతినుద్దేశించి ప్రసంగిస్తూ ఈ ఆదేశాలు జారీ చేశారు. దీంతో దేశంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.
'ఉత్తర కొరియా కమ్యూనిస్టు బలగాల నుంచి ముప్పును నివారించి స్వేచ్ఛాయుత దక్షిణ కొరియా రక్షణ కోసం, సంఘ వ్యతిరేక శక్తులను తుదముట్టించడానికి అత్యవసర సైనిక పాలన విధిస్తున్నాను' అని ప్రకటించారు. దేశ స్వేచ్ఛాయుత, రాజ్యాంగ పరమైన ఆదేశాలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని పిలుపునిచ్చారు.



# పాస్టరయ్య పాపాలను కడిగేదెవరు?

- పాస్టరయ్య బాధితుల వేదనకు న్యాయం జరిగే రోజెప్పుడు?
- ఆయన పాపాలకు చరమగీతం పాడేది ఎవరు?
- సహకరిస్తే అందలం ...ఎదురిస్తే నిందలే ..!
- బాధితుల్లో పాఠశాల విద్యార్థినీలు

**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు:**

పాస్టరయ్య పేరుతో ప్రసిద్ధి చెందిన ఆశ్రమ నిర్వాహకుడిపై తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఇతరుల పాపాలను కడుగుతానని చెప్పే ఆయన, స్వయంగా చేసిన పాపాలు ఎలా కడుగుతారోనని ప్రజల మధ్య చర్చ మొదలైంది.ఆశ్రమంలో మొత్తం 200 మంది సిస్టర్లు ఉండగా, ప్రస్తుతం కేవలం 40 మంది మాత్రమే ఉన్నారు. గతంలో ఆశ్రమానికి ఆశ్రయం పొందినవారిలో 25 మందికి పైగా లైంగిక వేధింపుల బాధితులుగా భావిస్తున్నారు. ఆ బాధితుల్లో పాఠశాల విద్యార్థినిలు కూడా ఉన్నట్లు సమాచారం.

**ఆర్థిక ప్రలోభాలు,బెదిరింపులు:**

ఆశ్రమ నిర్వాహకుడు పాస్టరయ్య, సహకరించే వారికి ఆర్థికంగా సహాయం చేస్తారు. కానీ ఎదురు నిలిచే వారికి నిందలు వేస్తూ, వారిని భయపెడతారని ఆరోపణలు ఉన్నాయి. బాధితులను "దయ్యం పట్టిందని" చెప్పి ఆశ్రమం నుంచి పంపించేస్తారని తెలుస్తోంది.పేదరికంతో ఆశ్రమానికి చేరిన కొందరు, పరిస్థితులు దిక్కుతోచని స్థితిలో ఉన్న మరికొందరు, పాస్టరయ్యను ఎదిరించలేక తల్లడిల్లుతున్నారు. కొందరు మహిళలు ఈ పీడ నుంచి బయటపడేందుకు ఎదురు చూస్తున్నారు. పాస్టరయ్య ఆచరణలు, ఇన్నేళ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే.ప్రజా సంఘాలు, బాధితులు శబ్దం లేవపెట్టకుంటే,ఇప్పుడు కూడా ఈ సమాచారం మొత్తం మూలన పడిపోతుందేమోనని నిపుణులు అంటున్నారు.

> **ఆశ్రమం లోపలి పరిస్థితులు**
>
> బాధితులు తమ సమస్యలను బయట పెట్టకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఆశ్రమంలో సమాచారం లీక్ అవ్వకుండా, నిఘా పెంచారు.విద్యార్థుల మధ్య సమాచారం పాకకుండా ఉండేందుకు పాఠశాలలను మార్చినట్లు తెలుస్తోంది.



# హైదరాబాద్ వైపు.. ప్రపంచం చూపు!

మొదటి పేజీ తరువాయి

అబద్ధాలతో పదేళ్లు గడిపేశారని ఆరోపించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ జాం తదితర సమస్యలతో నివసించడానికి ఇబ్బందికరంగా మారిందన్నారు. అందుకే హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారం 29 శాతం పెరిగిందన్నారు. హైడ్రా కేవలం అక్రమ నిర్మాణాలను మాత్రమే కూల్చుతోందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం ముందుకు వెళ్లకుండా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణకు, హైదరాబాద్‌కు నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. మెట్రోకు రూ.35 వేల కోట్లు, రీజినల్ రింగ్ రోడ్డుకు రూ.35 వేల కోట్లు ఖర్చవుతాయని, కేంద్రం నుంచి కిషన్ రెడ్డి ఎంత మేరకు నిధులు తీసుకువస్తారో చెప్పాలన్నారు. ప్రధాని మోదీ గుజరాత్‌కు నిధులు తీసుకెళుతుంటే కిషన్ రెడ్డి చూస్తూ ఉన్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి చేస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందని బీఆర్ఎస్ ఆందోళన చెందుతోందని విమర్శించారు.



# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అటవీ అనుమతులు

మొదటి పేజీ తరువాయి

చట్టం క్రింద ఏర్పాటు చేసిన అటవీ సంరక్షణ చట్టం2023 లోని నియమం 10 క్రింద ఏర్పాటు చేసిన రీజినల్ ఎంపవర్డ్ కమిటీ (REC) అనుమతులను మంజూరీ చేసినట్లు మంత్రి ఈ మేరకు తెలియజేశారు.19 సెప్టెంబర్ 2024 న జరిగిన 69వ సమావేశంలో REC ఈ అంశాన్ని చర్చించిన తరువాత, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన అదనపు పత్రాలను పరిశీలించి, ఈ ప్రతిపాదనకు అటవీ సంరక్షణ చట్టం1980 లోని సెక్షన్ '2' క్రింద "ఇన్‌ప్రిన్సిపల్" అనుమతిని మంజూరు చేస్తున్నట్లు సమాచారం ఇచ్చిందని మంత్రి వివరించారు. ఈ అనుమతుల ప్రకారం మెదక్ జిల్లాలో 35.5882 హెక్టార్లు, సిద్దిపేట జిల్లాలో 28.2544 హెక్టార్లు, , యాదాద్రిభువనగిరి జిల్లాలో 8.511 హెక్టార్లు మొత్తంగా మూడు జిల్లాల్లో కలిపి 72.3536 హెక్టార్ల అటవీ భూమిని భారత్‌మాల పరియోజన ఫేజ్ 1 కింద ఎన్.హెచ్.ఏ.ఐ క్రింద పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్) గజ్వేల్, ప్రయోజనార్థం హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ (HRRR) నిర్మాణానికి అనుమతిస్తున్నట్లు లేఖలో తెలిపారని మంత్రి తెలియజేశారు. అందుకు సంబంధించిన వివిధ నిబంధనల అమలుకు అనుగుణంగా అటవీ అనుమతులు లోబడి భూసేకరణ చేస్తామని పర్యావరణ మంత్రిత్వ శాఖకు తెలియజేసినట్లు మంత్రి తెలిపారు. అటవీ అనుమతుల సమస్య తీరడంతో ఇక ఎన్.హెచ్.ఏ.ఐ వద్ద పెండింగ్ లో ఉన్న టెక్నికల్ అప్రూవల్ వస్తే.. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు మార్గం సుగమం అవుతుందని మంత్రి వివరించారు.ఇప్పటిదాక 90 శాతం భూసేకరణ పూర్తయ్యిందని.. కొన్ని చిన్న చిన్న కోర్టు కేసుల భూములను త్వరలో పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామని తెలిపిన మంత్రి.. ఇప్పుడు అటవీ అనుమతులు రావడం పట్ల హర్షంవ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



# రేవంత్.. నువ్వెన్ని బ్లాక్‌మెయిల్స్ చేసినా భయపడను..

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఇవాళ(మంగళవారం) కేసు నమోదైంది. సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని పంజాగుట్ట పోలీసులకు చక్రధర్ ఫిర్యాదు చేశారు. దీంతో హరీష్ రావుతో పాటు టాస్క్ ఫోర్స్‌లో పనిచేసిన రాధాకిషన్ రావుపై కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసుతో పాటు మరికొన్ని తప్పుడు కేసులు నమోదు చేసినా భయపడనని సీఎం రేవంత్‌రెడ్డికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీష్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు.''నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడం. రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేసినవు అని అన్నందుకు యాదగిరిగుట్ట పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించావు. ఇచ్చిన హామీలను ఎగవేస్తున్న నిన్ను ఎగవేతల రేవంత్ రెడ్డి అని అన్నందుకు బేగంబజార్ పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించావు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో నా మీద సంబంధం లేని కేసు పెట్టించావు. పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డుమీద ఈకలు పీకి, తలాతోక లేని కేసు ఒకటి మానకొండూరులో అక్రమ కేసు పెట్టించావు. నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించావు. నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపను. ప్రజా కోర్టులో, ప్రజా తీర్పుతో నీకు తగిన శిక్ష పడేంత వరకు ఆగను'' అని హరీష్‌రావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

**నీ అన్యాయాలను నిలదీస్తా..**

''నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపను. మిస్టర్ రేవంత్ రెడ్డి.. అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీమీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావు'' అని హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మోసం, దగా, వంచనకు రేవంత్‌రెడ్డి ఏడాది పాలనే నిలువెత్తు నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అధికారం కోసం ప్రజలను మోసగించడం ఆయన నైజమని ఆరోపించారు. ఫిరాయింపులు, దబాయింపులు, బుకాయింపులతోనే కాంగ్రెస్ ఏడాది పాలన సాగిందని ధ్వజమెత్తారు. గతంలో మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి.. సీఎం అయ్యాక, ఉన్న రైతుబంధునే ఇవ్వడం లేదని హరీశ్‌రావు విమర్శించారు.కౌలు రైతులకూ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఓవైపు చెబుతుండగా.. మరోవైపు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రం రైతు భరోసా డబ్బులపై రైతు, కౌలు రైతు మాట్లాడుకోవాలని చెబుతున్నారని, ఇదెక్కడి విడ్డూరమని అన్నారు. రేవంత్ అరాచక, బుకాయింపు పాలనపై తెలంగాణ ప్రజల ముందు చార్జిషీట్ పెడతానని హరీశ్ చెప్పారు. కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యం, మోసాలను ఈ నెల 7న ప్రజలకు పూర్తిస్థాయిలో వివరిస్తానని తెలిపారు. శిలా ఫలకాలపై సీఎం పేరు ఉండొద్దన్న రేవంత్.. ఇప్పుడు ఏకంగా ఫొటోనే వేయించుకుంటున్నారని హరీశ్‌రావు ఆరోపించారు..




# కొండగట్టుకు వరుణ్‌తేజ్

**తెలంగాణ ముచ్చట్లు జగిత్యాల:**

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని సినీ హీరో వరుణ్‌తేజ్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామి సమక్షంలో గోత్రనామాలు చెబుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో స్వామివారి జ్ఞాపికగా చిత్రపటాలను ఈవో రామకృష్ణారావు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించగా, ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ మహిమాన్వితమైన కొండగట్టు ఆంజనేయస్వామిని హనుమాన్‌దీక్షలో దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కొండగట్టు ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని తెలుసుకున్నట్లు చెప్పారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# తుపాను మిగిల్చిన 'విషాదం!'

**తెలంగాణ ముచ్చట్లు,నేషనల్ బ్యూరో :**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తంగా 14 జిల్లాలు తీవ్ర ప్రభావానికి లోనైనట్లు ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. చెన్నైతోపాటు పాటు తిరువళ్లూరు, కాంచీపురం, విళుపురం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు, అంతకుమించిన వర్షాలు నమోదయ్యాయి. తంజావూరు, తిరువారూరు, నాగపట్టిణం, మయిలాడుదురై జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ప్రత్యేకించి ఫెయింజల్ తుపాను తీరం దాటే సమయంలో, దాటాక.. విళుపురం, కళ్లకురిచ్చి, కడలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో దారుణాలు చూడాల్సి వచ్చింది. తీర జిల్లాల మీదుగా గంటకి 90 కి.మీ. వేగంతో గాలులు వీయడంతో రోడ్లు, విద్యుత్తు తీగలు ధ్వంసమయ్యాయి. తీరానికి దూరంగా ఉన్న ధర్మపురి, కృష్ణగిరి, రాణిపేట, వేలూర్, తిరుపత్తూరు జిల్లాలపై సైతం ఫెయింజల్ ప్రతాపం చూపింది.

**సహాయక చర్యల్లో లక్షలాదిగా..**

ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికీ కొన్ని జిల్లాల్లో నష్ట అంచనా సరైన రీతిలో రాలేదు. సహాయక చర్యల్లో మాత్రం వీలైనంత వేగంగా స్పందిస్తున్నారు. ఇందుకోసం 38వేల మంది అధికారుల్ని బాధిత ప్రాంతాలకు పంపారు. నేరుగా ప్రజల్ని ఆదుకునేందుకు 1.12 లక్షల మంది నిపుణుల్ని రంగంలోకి దించారు. వారితో పాటు 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాల్ని, మరో 9 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు క్షేత్రస్థాయిలో ఉన్నాయి.

**ఒక్క రోజులోనే మొత్తం వర్షం**

విళుపురం, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై జిల్లాల్లో ఈ సీజన్‌లో కురవాల్సిన వర్షపాతం ఒక్కరోజులోనే పడటంతో దయనీయ పరిస్థితులు ఎదురైనట్లు ప్రభుత్వం తెలిపింది. ఆయా జిల్లాల్లో 24 గంటల్లోనే 50 సెం.మీ.కు మించిన వర్షపాతం నమోదైందని తెలిపారు. ఫలితంగా ఆస్తులు, పంటలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయని వివరించింది. వరదను తగ్గించేందుకు ఎక్కడక్కడ ఎవరి సామర్థ్యంమేర వారు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలిపింది. ప్రభావిత జిల్లాల్లో వరదను తోడేయటానికి పలుచోట్ల ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అత్యవసరానికి తగ్గట్లు 12,648 మోటార్లను అందుబాటులో ఉంచి నీటిని మరోచోటికి పంపింగ్ చేస్తున్నారు.

**బాధితులు కోటిన్నర మంది**

ప్రభుత్వ అంచనాల ప్రకారం తుపాను ప్రభావిత జిల్లాల్లో 69 లక్షల కుటుంబాల్లో 1.5 కోట్ల మంది బాధితులుగా మారినట్లు నివేదికలో తెలిపింది. ప్రభుత్వం దగ్గర ఉన్న అంచనాలు, వివిధ జిల్లాల్లో చోటుచేసుకున్న ఘటనల్ని బట్టి 21 మంది చనిపోయినట్లు స్పష్టత వస్తోంది. ఇందులో ప్రధానంగా విళుపురం, తిరువణ్ణామలైలోని మరణాలు కలచివేశాయి. కొండచరియలు విరిగిపడి, పెద్ద పెద్దరాళ్లు మీదపడటంతో తిరువణ్ణామలై వావుసి నగర్‌లో 7గురు మృత్యువాతపడ్డారు. విళుపురం జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన 8మంది మృతిచెందారు. చెన్నైలో నలుగురు, ఊటీలో ఒకరు, తెన్కాశి నుంచి చెన్నైకి చికిత్స వచ్చి మరణించిన మరో వ్యక్తి ఉన్నట్లు స్పష్టత వస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం నివేదికలో 12 మందిగా చూపారు.



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన తలసాని శ్రీనివాస్ యాదవ్..

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సనత్ నగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ కలిశారు. రేవంత్ నివాసానికి వచ్చిన తలసాని తన సోదరుడి కుమార్తె వివాహానికి రావాలని శుభలేఖ ఇచ్చారు. అనంతరం సీఎం షేక్ హ్యాండ్ తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం మాజీ మంత్రి మల్లా రెడ్డి కూడా తన మనవరాలి పెళ్లికి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. అయితే కొన్ని రోజుల క్రితం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. గ్రేటర్ హైదరాబాద్ చెందిన కొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్ తో టచ్ లోకి వచ్చారని చెప్పారు. దీంతో బీఆర్ఎస్ వర్గాల్లో ఆందోళన వ్యక్తం అయింది. ప్రస్తుతం అయితే ఎలాంటి చేరికలు జరగలేదు. కానీ చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలోకు హైకోర్టులో అనుకూలంగా తీర్పు రావడంతో ఫిరాయింపులు ఊపందుకునే అవకాశం ఉంది. ఫిరాయింపులపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. స్పీకర్ రీజనబుల్ టైమ్ లో ఎమ్మెల్యేల పై నిర్ణయం తీసుకోవాలని సూచించింది. దీంతో పార్టీ మారే వారికి మార్గం సుగమం అయింది. అయితే పార్టీ మారే యోచనలో ఉన్నవారితో బీఆర్ఎస్ బాస్ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కాగా ముగ్గురు ఎమ్మెల్యే పార్టీ మారడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. పార్టీ మారే ఎమ్మెల్యేల్లో ఒకరు గొర్రెల పథకంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మరో ఎమ్మెల్యేకు విద్యాసంస్థలు ఉన్నాయి. వీరిద్దరు పార్టీ మారితేనే సమస్యలు రావని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మూడో ఎమ్మెల్యే ఎవరు అని తెలియాల్సి ఉంది. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన వారిలో స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైతరాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఉన్నారు.



# గోదావరికావేరి నీటిలో సగం వాటా ఇవ్వాల్సిందే: తెలంగాణ


**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**

గోదావరికావేరి నదుల అనుసంధానానికి సంబంధించి తెలంగాణ కీలక విజ్ఞప్తి చేసింది. ఈ నదుల నుంచి తరలించే నీటిలో 148 టీఎంసీల్లో సగం వాటా ఇవ్వాల్సిందేనని మరోసారి జాతీయ జల అభివృద్ధి సంస్థ ను కోరింది. ఇక వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఎన్‌డబ్ల్యూడీఏ 74వ పాలక మండలి సమావేశం కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగింది. తెలంగాణ నుంచి నీటి పారుదలశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, ఇంజినీర్లు హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ఈ భేటీలో పాల్గొన్నారు. తెలంగాణ నుంచే ఈ ప్రాజెక్టును చేపట్టడం వల్ల అధిక భూభాగాన్ని కోల్పోతున్నామని.. ఇందుకోసం తమకు ఎక్కువ వాటా రావాల్సిందేనని జాతీయ జల మండలి సంస్థను కోరారు. 83 మీటర్ల ఎగువ నుంచే నీటిని తీసుకోవాలని తెలిపారు. అలాగే సమ్మక్కసాగర్, దేవాదుల, సీతారామ ప్రాజెక్టులకు 152 టీఎంసీల నీటి కేటాయింపులకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉండరాదని చెప్పారు. అయితే మళ్లించే నీటిలో 42 టీఎంసీలకు మించి తెలంగాణనకు నీటిని ఇవ్వలేమని కేంద్ర జలశక్తి శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రాలు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ నెలాఖరులో మరోసారి సమావేశం నిర్వహిస్తామని చెప్పింది. ఈ సమావేశంలో తామే నిర్ణయం తీసుకొని ముందుకెళ్లే యోచనలో ఉంది. ఇదిలాఉండగా ఈ ఏడాది ఆగస్టులోనే తెలంగాణ ప్రభుత్వం.. గోదావరి, కావేరి నదుల అనుసంధానంలో తరలించే నీటిలో సగం వాటా ఇవ్వాలని జాతీయ జల అభివృద్ధి సంస్థను కోరింది. అయితే 33 శాతం నీటి వాటాకు ఒప్పుకోవాలని సంస్థ విజ్ఞప్తి చేసినా కూడా.. 50 శాతానికి తగ్గకుండా నీళ్లు ఇవ్వాల్సిందేనని తెలంగాణ తేల్చిచెప్పింది.

దక్షిణ తెలంగాణలో ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అనేక ప్రాంతాలు కరవు పీడిత ప్రాంతాలుగా ఉన్నాయని.. 75 ఏళ్లు అవుతున్నా కూడా ఇప్పటికీ అక్కడ ఇరిగేషన్ వాటర్ సౌకర్యం లేదని చెప్పింది. ఆయా ప్రాంతాలకు నీటిని అందించాలంటే నీటి వాటాలో తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అయితే తాజాగా మరోసారి తెలంగాణ నీటిలో సగం వాటా ఇవ్వాలని అడగటం ప్రాధాన్యం సంతరించుకుంది. మరి జాతీయ జల అభివృద్ధి సంస్థ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనేదానిపై ఆసక్తి నెలకొంది.

# ఉనికి కోసమే భాజపా ఛార్జిషీట్

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**




ఉనికి కాపాడుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వంపై భాజపా ఛార్జిషీట్ విడుదల చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు.. భాజపా పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్ర ప్రభుత్వం.. కానీ దాని మీద స్పందన లేదు. అలాంటి మీరా.. రైతుల గురించి మాట్లాడేది? భాజపా ఇచ్చిన హామీలు పదేళ్లలో ఎన్ని అమలు చేసింది? రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నాం. కోటి కుటుంబాలు ఉచిత కరెంట్ రాయితీ పొందుతున్నాయి. 110 కోట్ల ఉచిత బస్ టికెట్లు ఇచ్చాం. ఏడాదికి రూ.20వేల కోట్ల వరకు సంక్షేమ కార్యక్రమాలకు ఇస్తున్నాం. భాజపా పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రుణమాఫీ చేస్తున్నారా? చమురు ధరలు పెరిగాయి.

# బిల్డింగ్స్, లే అవుట్ల పర్మిషన్లకు.. తెలంగాణలో కొత్త ఆన్లైన్ సిస్టమ్

**తెలంగాణ ముచ్చట్లు,హైదరాబాద్:**



కాంగ్రెస్ సర్కార్ తెలంగాణలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడానికి కొత్త విధానాన్ని రూపొందించింది. బిల్డ్ నౌ అనే పేరుతో ఆన్ లైన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది తెలంగాణ ప్రభుత్వం. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు డిసెంబర్ 3 (మంగళవారం) బిల్డ్ నౌ ను ప్రారంభించారు. ఇక నుంచి తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు, లే అవుట్లు నిర్మించాలంటే బిల్డ్ నౌలో ఆన్ లైన్ లో పర్మిషన్ తీసుకోవాలి. అత్యాధునిక ప్రజాపాలన దిశగా ఒక విప్లవాత్మక అడుగు బిల్డ్ నౌ అని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. బిల్డ్ నౌ స్మూట్నీ లేటెస్ట్ టెక్నాలజీతో ప్రాసెసింగ్ సమయాన్ని వారాల నుంచి నిమిషాలకు తగ్గిస్తుంది. ఈ కొత్త వ్యవస్థ అనేక టెక్నాలజీలను కలిగిఉంది. ప్రజలు పలు డిపార్ట్ మెంట్ల చుట్టూ తిరగకుండా, వివిధ పోర్టల్స్ మారే అవసరం లేకుండా పర్మిషన్ అంతా ఒకే చోట పూర్తి చేయగల సింగిల్ విండో ఇంటర్ పేస్ బిల్డ్ నౌ. ప్రజలు తమ భవనాలను నిర్మాణానికి ముందే అగ్మెంటెడ్ రియాలిటీ 3డీ విజువలైజేషన్ ద్వారా చూడొచ్చు.

భవన నిబంధనలపై తక్షణం, కచ్చితమైన మార్గదర్శకాలను ఈ AI ఆధారిత పవర్డ్ అసిస్టెంట్ అందిస్తుంది. ప్రతి దరఖాస్తును ధృవీకరించి ట్రాక్ చేసేందుకు నమ్మకాన్ని బ్లాక్ చైన్ టెక్నాలజీ అవాకశం కల్పిస్తుంది. డేటా ఆధారిత పాలనను చిత్తశుద్ధితో అమలు చేస్తుంది.

గతంలో ఎప్పుడు లేని విధంగా.. పట్టణాభివృద్ధి రంగం అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో వ్యాపార రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని మంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణలో దాదాపు 60 శాతం మంది జనాభా పట్టణ నగర ప్రాంతాల్లో ఉంటున్నందున ఈ శాఖపై స్పెషల్ ఫోకస్ ఉందని.. అందుకే స్వయంగా ముఖ్యమంత్రే పర్యవేక్షిస్తున్నారని ఆయన అన్నారు. స్థిరాస్తి రంగంలో హైదరాబాద్ నగరం ఫస్ట్ ప్లేస్ లో ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# మహారాష్ట్రలో కీలక పరిణామం.. షిండే ఇంటికి చేరుకున్న ఫడ్నవీస్

**తెలంగాణ ముచ్చట్లు,నేషనల్ బ్యూరో :**



డిసెంబర్ 5న మహారాష్ట్రలో కొత్త ప్రభుత్వం కొలువుతీరనుంది. తదుపరి సీఎం ఎవరు అనేదానిపై సాగిన ఉత్కంఠకు తెర పడినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ పేరు ఖరారైపోయింది. అలాగే ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ డిప్యూటీ సీఎంలుగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమచారం. ఈ నేపథ్యంలో తాజాగా ఫడ్నవీస్.. షిండే నివాసానికి చేరుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి వారు కీలక చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నాయి.

ఏక్‌నాథ్ షిండే ఇంటికి ఫడ్నవీస్ వెళ్లడం ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది. షిండే సీఎం పదవి తనకు రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారని ఆయన అనుచరులు చెబుతున్నారు. అయినప్పటికీ కూడా ఇటీవలే షిండే.. తాను సీఎం పదవిపై ప్రదాని మోదీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని ప్రకటించారు. ఈ క్రమంలోనే బీజేపీ హైకమాండ్ చివరికి దేవేంద్ర ఫడ్నవీస్‌కు సీఎం బాధ్యతలు అప్పగించిందని తెలుస్తోంది.

ఇదిలాఉండగా.. డిసెంబర్ 4న బీజేపీ శాసనసభా పక్ష నేతల సమావేశం జరగనుంది. ఈ భేటీలో ఎమ్మెల్యేలు సీఎంను ఎన్నుకోనున్నారు. మొత్తానికి బుధవారం మహారాష్ట్ర సీఎం ఎవరు అనేది తేలిపోనుంది. ఎన్డీయే నేత రామ్‌దాస్ అథవాలే తాజాగా ఏక్‌నాథ్ షిండేతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం పదవికి అంగీకరించాలని ఆయన షిండేను నచ్చజెప్పినట్లు పలు కథనాలు వెల్లడించాయి. ఈ పదవి తీసుకునేందుకు షిండే కూడా సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవైపు డిప్యూటీ సీఎంపై షిండే ఆసక్తి చూపించడం లేదనే ప్రచారం కూడా నడుస్తోంది. ఇలాంటి నేపథ్యంలో షిండేతో.. ఫడ్నవీస్ సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇదిలాఉండగా.. ఇటీవల అనారోగ్యం కారణంగా షిండే తన సొంతూరు వెళ్లిన సంగతి తెలిసిందే. ఆదివారం ఆయన మళ్లీ ముంబయికి తిరిగి వచ్చారు. ఆరోగ్యం ఇంకా మెరుగుపడకపోవడంతో మంగళవారం షిండేను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఠాణెలోని ఓ ఆసుపత్రిలో ఆయన చెకప్ చేయించుకున్నారు.



# మంత్రిపై బురద చల్లిన వరద బాధితులు..

**తెలంగాణ ముచ్చట్లు,నేషనల్ బ్యూరో :**

తమిళనాడు, పుదుచ్చేరితో సహా ఇతర ప్రాంతాల్లో ఫెంగల్ తుపాను బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. దీని ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ క్రమంలోనే తమిళనాడు మంత్రి తిరు పొన్ముడి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించగా.. ఆయనకు చేదు అనుభవం ఎదురైంది. మంత్రి ఆ ప్రాంతాలకు రావడంతో వరద బాధితులు ఆయనకు బురదతో స్వాగతం పలికారు. పలువురు ఏకంగా ఆయనపై బురదను చల్లారు. దీనికి సంబంధించిన వీడియోను బీజేపీ నేత అన్నామలై ఎక్స్‌లో షేర్ చేయగా.. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

తమిళనాడులో ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఇది. ముఖ్యమంత్రి స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి చెన్నై విధుల్లో తిరుగుతూ ఫొటోలు దిగడంలో బీజీగా ఉన్నారు. నగరంలో తక్కువ వర్షం కురిసింది. అయినప్పటికీ చుట్టు పక్కల ప్రాంతాల పరిస్థితులను వాళ్లు పట్టించుకోవడం లేదు. ఈరోజు ప్రజలు వరద ప్రభావిత ప్రాంతాలకు వచ్చిన అవినీతి డీఎంకే నేత తిరు పొన్ముడిపై ప్రజలు తమ కోపాన్ని చూపించారు. ఆయనపై బురద జల్లారు. బాధితుల ఆవేదన ఏ స్థాయిలో ఉందో డీఎంకేకు ఇదో ముందస్తు హెచ్చరిక అంటూ చురకలంటించారు.

ఇదిలాఉండగా.. ఫెంగల్ తుపాను వల్ల తమిళనాడు, పుదుచ్చేరి అతాలకుతలం అయ్యింది. ఈ తుపాను ధాటికి ఇప్పటివరకు 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. దీని తీవ్రతకు కొండపై నుంచి పెద్ద బండరాళ్లు కూడా దొర్లి జనావాసాల పై పడ్డాయి. పలువురు మట్టిలో కూరుకుపోయారు. వాళ్లని గుర్తించేందుకు సహాయక సిబ్బంది చర్యలు చేపట్టారు. అయితే వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లిన మంత్రిపై బాధితులు బురద చల్లడం దుమారం రేపుతోంది.

# పీఎం సూర్యఘర్ పథకానికి 1.45 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు..

**తెలంగాణ ముచ్చట్లు,నేషనల్ బ్యూరో :**



ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి సౌర విద్యుత్ పొందేలా మోదీ ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పథకానికి ఇప్పటివరకు దాదాపు 1.45 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని తాజాగా కేంద్రం వెల్లడించింది. అలాగే 6.34 లక్షల ఇన్‌స్టాలేషన్లు కూడా పూర్తి అయినట్లు కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ పార్లమెంటులో తెలిపారు.

20232024 నుంచి 202627 ఆర్థిక సంవత్సరం వరకు రూ.75,021 కోట్ల ఖర్చుతో ఈ పీఎం సూర్యఘర్ కింద కోటి ఇన్‌స్టాలేషన్లు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ స్కీమ్‌కు సంబంధించిన జాతీయ పోర్టల్‌లో దాదాపు 1.45 కోట్ల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని.. 26.38 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని మంత్రి వెల్లడించారు. వీళ్లలో 6.34 లక్షల మందికి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్లు పూర్తి చేసినట్లు ఆయన రాజ్యసభలో తెలిపారు.

అంతేకాదు 3.66 లక్షల మంది దరఖాస్తుదారులకు సబ్సిడీలు విడుదల చేశామన్నారు. ఇది 15 నుంచి 21 రోజుల్లో క్రమం తప్పకుండా విడుదలవుతుందని పేర్కొన్నారు. అయితే పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా గుజరాత్‌లో అత్యధికంగా 2,86,545 ఇన్‌స్టాలేషన్లు పూర్తయ్యాయని తెలిపారు. మహారాష్ట్రంలో 1,26,344 పూర్తయినట్లు చెప్పారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
బుధవారం 04 –12–2024





# ఘనంగా జాతీయ వ్యవసాయ దినోత్సవం

**వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ వ్యవసాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మోజెర్ల ఉద్యానవన కళాశాల అధ్యాపకులు విద్య, భాస్కర్ మరియు వారి బృందం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి. వ్యవసాయము మరియు ఉద్యానవనాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదవ తరగతి తర్వాత డిప్లమా లేదా బైపీసీ ద్వారా ఉద్యానవన కళాశాలలో చేరి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వరప్రసాదరావు, ఉపాధ్యాయులు రణదీవ్, పి వెంకటస్వామి, గద్వాల కృష్ణ, భగవంతు, వాణి ప్రభ, పుల్లయ్య,ఎన్ వెంకటస్వామి,పాల్గొన్నారు.

# నవశకానికి నాంది పలికి నేటికీ ఏడాది

- టీఎంఆర్ యువసేన సభ్యులు శివ యాదవ్

**వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:**



మాజీమంత్రి నిరంజన్ రెడ్డి అధికారం చేతిలో ఉందని ఇష్టానుసారంగా ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా పాలన సాగించారు. స్వేచ్ఛ లేకుండా ప్రజలను హింసిస్తే ప్రజాక్షేత్రంలో మాజీ మంత్రిని వనపర్తి ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెప్పారని టిఎంఆర్ యువసేన సభ్యులు శివ యాదవ్ విమర్శించారు.గతంలో తాను వనపర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతిపై సోషల్ మీడియాలో వచ్చిన ఒక పోస్టును ఫార్వార్డ్ చేయడం వల్ల తనను చిత్రహింసలకు గురి చేశారని, పోలీసు అధికారిని అస్త్రంగా ఉపయోగించుకుని తన అధికారమధంతో విచ్చలవిడిగా దాడి చేయించి తనను తీవ్రంగా గాయపరిచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తి ప్రజల శాపనార్థాలు తగిలి మంత్రి ఘోరంగాఓడిపోయారు.కాంగ్రెస్ ప్రజాపాలనలో వనపర్తి ఎటువంటి నిర్బంధాలు, అక్రమ కేసులు, భూ కబ్జాలు, కమిషన్లు, ఎటువంటి అవినీతికి తావివ్వకుండా వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి అద్భుతమైన పరిపాలన అందిస్తున్నారు.వనపర్తి నియోజకవర్గంలో నిరుపేద కుటుంబాలకు సంబంధించిన వారు ఏదైనా కారణం చేత మరణిస్తే దహన సంస్కారాలకు ఆర్థికసహాయం చేసిన గొప్ప మానవతావాది వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి. అధికార మదంతో అహంకారం ప్రదర్శించే గత నాయకుని చూశాను, కానీ ప్రేమాభిమానంతో ప్రజా పరిపాలన చేస్తున్న వ్యక్తి ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి అని అన్నారు.`



## శ్రీకాంతాచారి త్యాగం
# చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది

- మాజీ ఎంపీ నామ

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ మలి దశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009 డిసెంబర్ 3న తన ప్రాణాలను అర్పించిన కాసోజు శ్రీకాంతాచారి త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ, నాడు కేసీఆర్ అరెస్టుకు నిరసనగా నవంబర్ 29న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న శ్రీకాంతాచారి ఐదు రోజుల పాటు గాయాలతో పోరాడి, చివరకు డిసెంబర్ 3, 2009న 'జై తెలంగాణ' నినాదంతో తుదిశ్వాస విడిచారు" అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు శ్రీకాంతాచారి చేసిన ఆత్మార్పణం తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుందని, తెలంగాణ ఉద్యమ విజయానికి ఆయన త్యాగం స్ఫూర్తిగా నిలిచిందన్నారు. మనమంతా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని నామ తెలిపారు.



# మేఘన్న అభయ హస్తం ద్వారా మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి గ్రామానికి చెందిన గిల్లి నరసింహ 48 అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఇట్టి విషయాన్ని వనపర్తి శాసన సభ్యులు మేఘ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మేఘ రెడ్డి అభయహస్తం ద్వారా గిల్లి నరసింహ కుటుంబానికి 5000/ రూపాయలు ఆర్థిక సహాయం టిఎంఆర్ నాయకుల ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, మాజి హైస్కూల్ చైర్మన్ సూర్య రవి, పుల్లన్న యాదవ్ ,మాజి ఎంపిటిసి బుచాన్న,గౌడుగు రాజశేఖర్, నాయకులు గట్టు రాజశేఖర్ ,మణిగిల్ల కృష్ణయ్య ,హనుమంతు,రాములు,నరసింహ,మేహబూబు,వెంకట్రాములు,కురుమూర్తి,కృష్ణయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఒక జిల్లా..ఒకే ఉత్పత్తి (ఓడీఓపీ) అమలు పరిస్థితి ఏమిటి..?

- జిల్లా-నిర్దిష్ట ప్రణాళికను రూపొందించడంలో రాష్ట్రాల పాత్ర వివరాలేంటి..?
- రైతులు, మధ్యతరహా పారిశ్రామికవేత్తలకు ఏం ప్రయోజనాలు జరుగుతున్నాయి..?
- లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



ఒక జిల్లా..ఒకే ఉత్పత్తి(ఓడీఓపీ)అమలుపై ప్రస్తుత స్థితి ఏమిటి..? అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో ప్రశ్నించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా.. ప్రత్యేక ఉత్పత్తుల మార్కెటింగ్, ఎగుమతులకు తీసుకున్న చర్యలు, చిన్న, సన్న కారు రైతుల కోసం జిల్లానిర్దిష్ట ప్రణాళికను రూపొందించడంలో రాష్ట్రాల పాత్ర పై.. మంగళవారం ప్రశ్నలు సంధించారు. దీనికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ అంటే..ఒక జిల్లా నుంచి కనీసం ఒక ఉత్పత్తిని ఎంపిక చేసి.. బ్రాండ్, ప్రచారం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇలా. దేశవ్యాప్తంగా 782 జిల్లాల నుంచి 1,259 ఉత్పత్తులను గుర్తించామని చెప్పారు. వస్త్రాలు, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, హస్తకళలు తదితర రంగాలు ఉన్నట్లు పేర్కొన్నారు.ఇందులో భాగంగా తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో మిర్చి పంటకు, అలాగే గ్రానైట్ పరిశ్రమకు విశేష ప్రాచుర్యం కల్పిస్తున్నట్లు..తెలిపారు.. ఇంకా..ఉత్పత్తులు దేశీయ ప్రదర్శనలలో పాల్గొనడాన్ని సులభతరం చేశామని, ప్రభుత్వ ఇమార్కెట్ ప్లేస్ (జి ఈ ఏం) కోసం ఇకామర్స్ ఆన్‌బోర్డింగ్ డ్రైవ్‌లు అందుబాటులోకి తెచ్చామని, అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహించేలా.. విదేశాల్లో కూడా జరిగేలా, కొనుగోలుదారుల సమావేశాలు నిర్వహించేలా.. చర్యలు చేపట్టినట్లు వివరించారు.ఇంకా.. డిస్ట్రిక్ట్ యాజ్ ఎక్స్‌పోర్ట్ హబ్ (డి ఈ హెచ్ ) చొరవ కింద, దేశంలోని అన్ని జిల్లాల్లో ఎగుమతి సామర్థ్యం ఉన్న ఉత్పత్తులపై.. వాటాదారులతో సంప్రదింపులు జరుగుతుందని తెలిపారు.

**సంస్థాగతంగా చర్యలు..**

జిల్లా స్థాయిలో స్టేట్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ ( ఎస్ ఈ పి సి), డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డి ఈ ఫీ సి)ని ఏర్పాటు చేయడం ద్వారా అన్ని రాష్ట్రాలు/యు టి ఎస్ లో సంస్థాగత యంత్రాంగం ఏర్పాటు చేయబడిందని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డికి.. కేంద్ర సహాయ మంత్రి తన జవాబులో వివరించారు. ఈ పథకం అమలులో రాష్ట్రాల పాత్ర కీలకమని తెలపారు. ప్రత్యేకమైన బ్రాండింగ్‌ను అభివృద్ధి చేయడం, అంకితమైన నోడల్ అధికారులను నియమించడం, విక్రేత డేటాబేస్ సృష్టించడం, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించడం రాష్ట్రాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. జిల్లానిర్దిష్ట ఉత్పత్తుల గుర్తింపు, ప్రాంతీయ వస్తువులకు ప్రత్యేక గుర్తింపును సృష్టించడం ద్వారా రైతులకు, మధ్య తరహా వ్యాపారవేత్తల కోసం కేంద్ర ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళిక రూపొందించిందని..ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి వివరించారు.



## ఆర్టీసీ ఉద్యోగులందరూ
# ఒకే కుటుంబ సభ్యులు

- ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరామ్
- ఆర్టీసీ కార్మికుల ఐక్యతను పెంచేందుకే వనభోజనాల కార్యక్రమం
- ఎండి సజ్జనార్ కు కృతజ్ఞతలు తెలిపిన ఆర్టీసీ సిబ్బంది

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ ఒకే కుటుంబానికి చెందిన వారిని వారందరి ఐక్యత కోసమే కార్తీక మాస వనభోజన మహోత్సవాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఖమ్మం డిపో ఆవరణంలో డిపో మేనేజర్ దినేష్ కుమార్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటుచేసిన వనభోజన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో పనిచేసే వారు రాత్రి, పగలు, ఎండ వాన చలి భేదం లేకుండా అహర్నిశలు పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబ సభ్యులందరను కార్తీకమాస వనభోజన మహోత్సవాల పేరుతో ఒకచోటకు చేర్చి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటుచేసి ఒకే దగ్గర కూర్చొని సంతోషంగా మాట్లాడుకుంటూ ఆతిథ్యం ఏర్పాటు చేయటం ఎంతో సంతోషకరంగా ఉందని అన్నారు. ఆర్టీసీ కార్మికుల ఐక్యతను పెంచేందుకు వనభోజనాల కార్యక్రమమును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించిన సందర్భంగా గెలిచిన వారికి ఆర్ఎం చేతులు మీదుగా బహుమతులను అందజేశారు. అదేవిధంగా సంస్థలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేయబడిన వారికి కూడా బహుమతులను అందజేశారు. వనభోజన కార్యక్రమంలో కొమ్ము వినోదరావు "నీ సుఖమే నే కోరుకున్నా.." అని పాడిన పాట ఉద్యోగులను ఎంతో ఉత్సాహపరిచింది. ఆర్టీసీలో ఉద్యోగుల కుటుంబ సభ్యులతో వనభోజన కార్యక్రమాల ఏర్పాటుకు అవకాశం ఇచ్చిన ఎండి సజ్జనార్ ఆర్టీసీ ఉద్యోగ సభ్యులందరూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ భవాని ప్రసాద్, డిపో మేనేజర్ దినేష్ కుమార్, అకౌంట్ ఆఫీసర్ బాలస్వామి, పర్సనల్ ఆఫీసర్ జివిస్ నారాయణ, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య, డాక్టర్ సాయి సుష్మ, తెలంగాణ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి మేరుగు రవీంద్రనాథ్, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బేతంపూడి బుచ్చిబాబు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి గుగ్గిళ్ళ రోశయ్య, వెల్ఫేర్ బోర్డు సభ్యులు ఎండి రంజాన్, సుధాకర్ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, కానిస్టేబుల్ ఉష, కంట్రోలర్ మాధవరావు, ఆర్టీసీ సిబ్బంది కొమ్ము వినోదరావు, అనిత తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ సమస్యల
# పరిష్కారానికి దృష్టి పెట్టాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై గ్రామస్థాయిలో సమీక్షలు చేపట్టాలని ఆమె సూచించారు.రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుంటూ విద్యుత్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఓవర్‌లోడ్ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లూజ్ లైన్ల కారణంగా ప్రమాదాలు జరుగుతుండటంతో మిడిల్ పోల్‌స్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు.పాలకుర్తి మండలంలో 400 మిడిల్ పోల్స్, కొడకండ్ల మండలంలో 300 మిడిల్ పోల్స్ ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆమె పేర్కొన్నారు.విద్యుత్ లోడింగ్ సమస్యలను అధిగమించేందుకు పాలకుర్తి మండలంలోని తొర్రూరు, మల్లంపల్లి, ముత్తారం గ్రామాల్లో మూడు సబ్ స్టేషన్లను మంజూరు చేసి నిర్మాణ పనులు వేగవంతం చేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదకరమైన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, రైతులతో సమన్వయం సాధించి సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. "రైతులకు విద్యుత్ సరఫరా సమస్యల వల్ల ఇబ్బందులు కలిగితే చర్యలు తప్పవు" అని ఎమ్మెల్యే హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు, వివిధ గ్రామ పార్టీల సభ్యులు పాల్గొన్నారు.



## ఫోన్ పోతే..సి.ఇ. ఐ.ఆర్
# పోర్టల్ లో ఫిర్యాదు చేయండి

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఐపిఎస్

**వరంగల్ క్రైమ్,తెలంగాణ ముచ్చట్లు:**

సెల్ ఫోన్ యజమానులు తమ ఫోన్ పోగొట్టుకుంటే చింతించవద్దని... తక్షణమే సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు ఇవ్వాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్ యజమానులు పోగొట్టుకున్న సెల్ ఫోన్ల స్వాధీనంకు సంబంధించి హనుమకొండ పోలీసుల ఆధ్వర్యంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోగొట్టుకున్న సెల్ ఫోన్ల ఆచూకీ కనుగొని పోలీస్ స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్ల ను వరంగల్ పోలీస్ కమిషనర్ చేతులమీదుగా సెల్ ఫోన్ యజమానులకు అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దొంగతనం కాని పోగొట్టుకున్న సెల్ ఫోన్ల ఆచూకీ సిసిఎస్ తో పాటు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని. వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సెల్ ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికై డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్(సిఈఐఆర్) పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సి.ఇ.ఐ. ఆర్ పోర్టల్ (ceir.gov.in) నందు బ్లాక్ చేసి, సంబందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా హనుమకొండ ఏసీపీ, ఇన్స్ స్పెక్టర్ సతీష్, హోమ్ గార్డ్ అశోక్ లను పోలీస్ కమిషనర్ అభినందించారు.



## బస్టాండ్ ప్రాంగణంలోనే
# సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి

- అఖిలపక్ష నేతల డిమాండ్

**దేవురుప్పల,తెలంగాణ ముచ్చట్లు:**

జనగామ జిల్లా దేవరుప్పుల మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించడంపై వివాదం నెలకొంది. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో బస్టాండ్ ప్రదేశం అన్యాక్రాంతం కావడంతో, అఖిలపక్ష నాయకులు వంద రోజుల పాటు నిరసనలు, నిరాహార దీక్షలు చేపట్టారు. సంబంధిత అధికారులు బస్టాండ్ ప్రాంగణాన్ని సందర్శించి, ప్రయాణికుల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆమోదం తెలిపినప్పటికీ, ఇప్పుడు ఆ నిర్మాణాన్ని వేరే ప్రదేశానికి తరలించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తుండటంపై అఖిలపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి బస్టాండ్ ప్రాంగణంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టకపోవడం పట్ల నాయకులు మండిపడ్డారు. పాలకుర్తి నియోజకవర్గ మహిళా ఎమ్మెల్యేకు మహిళల సమస్యలపై నిర్లక్ష్య ధోరణి ఎందుకని ప్రశ్నించారు. బస్టాండ్ ప్రాంగణంలోనే సులభ్ కాంప్లెక్స్ నిర్మించకుంటే ప్రజా ఉద్యమాలు చేపట్టుతామని హెచ్చరించారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా గుర్తుచేశారు.సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేశ్, సిపిఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి చింత రవి, బీజేపీ మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని బస్టాండ్ ప్రాంగణంలో సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజా ప్రయోజనాలను ముందుకు పెట్టి నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక






# మనో సంకల్పం ముందు వైకల్యం అవరోధం కాదు

- హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య పాల్గొని, “మనో సంకల్పం ముందు వైకల్యం అవరోధం కాదు” అనే సందేశాన్ని అందించారు.

జీవితంలో ఎదురయ్యే వైకల్యాలను అవరోధంగా భావించకుండా, భవిష్యత్ పట్ల దృష్టి సారించి ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సామాజికంగా మరియు ఆర్థికంగా దివ్యాంగుల అభ్యున్నతి కోసం పలు కార్యక్రమాలు అమలులో ఉన్నాయని, అందుకు ప్రైవేట్ రంగాలతో పాటు ప్రభుత్వ యంత్రాంగాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.దివ్యాంగుల కోసం ర్యాంపు వంటి సౌకర్యాలను ప్రభుత్వ కార్యాలయాల్లో కల్పించాలన్న నిబంధనల అమలుపై అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మార్గనిర్దేశం చేశారు. జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి వివిధ పథకాల గురించి వివరించగా, తెలంగాణ మైనార్టీ కమిషన్ సభ్యుడు సర్దార్ దర్శన్ సింగ్ దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### విద్య, ఉపాధికి ప్రోత్సాహం

ప్రి, పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాలు, స్వయం ఉపాధి పథకాలు, వివాహ ప్రోత్సాహక బహుమతులు, ఉపాధి శిక్షణలు వంటి కార్యక్రమాలను దివ్యాంగుల సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.సాంస్కృతిక ప్రదర్శనలు, బహుమతులు ఈ సందర్భంగా బన్ను, మల్లికాంబ, స్పందన, అతిథి వంటి సంస్థల చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి క్రీడల్లో విజేతలైన దివ్యాంగులకు కలెక్టర్ పి. ప్రావిణ్య బహుమతులు అందజేశారు.

**కార్యక్రమంలో పాల్గొన్న వారు**

ఈ కార్యక్రమంలో ఆర్డీడీ ఝూన్సి లక్ష్మి బాయి, డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కే. అనితారెడ్డి, ప్రముఖ కవి బిల్ల మహేందర్, డాక్టర్ వెంకట్ రాం రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు,తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి పదవి కోసం మాలల ఉద్యమం

- మాదిగ హక్కుల పరిరక్షణ సమితి విమర్శ

ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:

మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌పై తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, వివేక్ మాలల ఉద్యమాన్ని మంత్రి పదవి కోసం మాత్రమే ఉపయోగించుకుంటున్నాడని ఆరోపించారు.తెలంగాణలో మాదిగ జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ చేయవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, వివేక్ దీనికి వ్యతిరేకంగా మాలల ఉద్యమం చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ, ఆ పార్టీ ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజులు వ్యతిరేకంగా వ్యవహరించడం పార్టీ విధానాలకు వ్యతిరేకమని, వీరిని వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.పదవుల కోసం వివేక్ అన్ని పార్టీలను సంప్రదించిన వ్యక్తి అని వ్యాఖ్యానించిన ఉపేందర్, స్వార్థపూరిత రాజకీయాలకు మాదిగల ఉద్యమాన్ని అడ్డుపెట్టుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పదవి కోసం ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, మాదిగలకు అన్యాయం జరిగితే వారి సత్తా ఏమిటో ప్రభుత్వానికి చూపుతామన్నారు. ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఉపేందర్ హెచ్చరించారు.



## తెలంగాణ అమరుడు
# కాసోజు శ్రీకాంతాచారికి ఘన నివాళి

సూర్యాపేట,తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి గారి 15వ వర్థంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం మరియు కార్పెంటర్ యూనియన్ ఆధ్వర్యంలో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసోజు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన త్యాగాలను స్మరించుకున్నారు.

**కాసోజు శ్రీకాంతాచారి త్యాగం**

తెలంగాణ కోసం తన ప్రాణాలను అర్పించిన శ్రీకాంతాచారి త్యాగం ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తుందని, ఆయన ఆశయాలను సాకారం చేయడం ప్రతి తెలంగాణవాసి బాధ్యతగా ఉండాలనే సందేశాన్ని ఈ కార్యక్రమంలో గుర్తుచేశారు. కాసోజు శ్రీకాంతాచారి జ్ఞాపకాలను మరోసారి ప్రజల మనసుల్లో జ్వలింపజేసింది.

### నివాళులర్పించిన ప్రముఖులు

ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సలేంద్ర చారి, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు అమరావతి శ్రవణ్, పోతుగంటి వీరాచారి, కూరెల్లి మనోహర్, శ్రీపాది జానకి రాములు, బహు రోజు లింగాచారి, కేశవరపు కిరణ్, మేడారపు బ్రహ్మాచారి, బహు రోజు ఉపేందర్, పరిపూర్ణ చారి, నర్సింగోజు వీరాచారి, చిలకమర్రి గోవిందా చారి, గడగోజు జయరాం, బహు రోజు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



## గొల్లకురుమల హక్కుల సాధన కోసం
# ప్రజాభవన్ ముట్టడికి పిలుపు

జనగాం,తెలంగాణ ముచ్చట్లు:

గొల్లకురుమలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై పోరాటం తారస్థాయికి చేరుకుంది. గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ పిలుపు మేరకు ఈనెల 9న ప్రజాభవన్ ముట్టడిని విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి కన్నెబోయిన బాలరాజు పిలుపునిచ్చారు.

**ప్రస్తుత సమస్యలు**

గొల్లకురుమలు ఎటువంటి రక్షణ లేకుండా జీవిస్తున్నారని, రాత్రి వేళ గొర్రెలను కుక్కలు చంపడం, దొంగల బెడద, అటవీశాఖ ఆంక్షలు, పశువైద్య సౌకర్యాల అభావం వంటి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని మండిపడ్డారు. పశువైద్య ఖాళీ పోస్టుల భర్తీ, అవసరమైన మందుల సరఫరా, జీవో 559 అమలు వంటి డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.గొల్లకురుమల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా వ్యాప్తంగా ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, పార్టీలకు అతీతంగా అందరూ ప్రజాభవన్ ముట్టడిలో పాల్గొని దాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎంటె శ్రీనివాస్, దొరగొల్ల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ హామీలు ఎక్కడికి పోయాయి?**

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గొల్లకురుమల కోసం ప్రత్యేక హామీలు ఇచ్చింది. వాటిలో రెండో విడత DDలు తీసుకున్న వారికి గొర్రెల పంపిణీ, మిగిలిన వారికి రూ. 2 లక్షల నగదు బదిలీ, గొర్రెల ప్రమాద బీమా పథకం, గొర్రెల కాపరులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒక్క గొర్రెకు రూ. 10 వేల ఇన్సూరెన్స్, 50 సంవత్సరాలు దాటిన వారికి నెలకు రూ. 5000 పింఛన్ వంటి హామీలను కాంగ్రెస్ ప్రచారంలో ముందుకు తెచ్చింది. అయితే, ప్రభుత్వం అవి అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బాలరాజు అన్నారు.



# ధర్మసాగర్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పరిణామ సిద్ధాంతంపై సదస్సు

ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:

జీవ పరిణామం ప్రకృతిలో సహజమైన మార్పు అని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ధర్మసాగర్ మండలంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ధర్మప్రకాష్ అధ్యక్షత వహించారు. సదస్సులో “పరిణామ సత్యాన్ని చాటుదాం” అనే అంశంపై జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కవితా దేవి కీలక ఉపన్యాసం చేస్తూ, ప్రతి జీవి తన పూర్వీకుల నుండి పరిణామంతో ఆవిర్భవిస్తుందని, ఇది సహజ లక్షణమని స్పష్టంచేశారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రచురించిన చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని తెలియజేసే పోస్టర్లను ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు సురేష్ సమన్వయకర్తగా వ్యవహరించగా, ఉపాధ్యాయులు పద్మజ, రాజమ్మ, కిరణ్మయి, రామకృష్ణ, ప్రసన్నలు పరిణామ సిద్ధాంతాన్ని కణస్థాయి నుండి జీవ స్థాయి వరకు ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు.సదస్సు విద్యార్థులలో పరిణామ సిద్ధాంతంపై ఆసక్తిని, విజ్ఞానాన్ని పెంచింది.





## ఆదరణ సేవ ఫౌండేషన్ కి
# బియ్యం సరుకులు వితరణ

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

మధిర పట్టణం సుశీల డిగ్రీ కాలేజ్ రోడ్ లో ఆదరణ సేవ ఫౌండేషన్ లో విజయవాడ వాస్తవ్యులు దొడ్డ గోపాల్ రావు భారతి కుమారుడు వెంకటేష్ సందర్భంగా వృద్ధులకి మతిస్థిమితం లేని వారికి బియ్యం నిత్యవసర సరుకులు అందించడం జరిగింది ఈ సందర్భంగా ఆదరణ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిస్సి హరిణి బియ్యం సరుకులు అందజేసిన గోపాల్ రావుకి ప్రత్యేక ధన్యవాదాలు వెంకటేష్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో దొడ్డ శ్రీనివాసరావు దాచేపల్లి ముత్యాలరావు మహంకాళి వెంకట శ్రీనివాసరావు కోనా సుబ్బారావు చలువాది చిన్న కృష్ణమూర్తి కొల్ల శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.




## ఎస్సీ వర్గీకరణ ఏ బి సి డి అమలు
# చేశాకే ఉద్యోగం నోటిఫికేషన్ ఇవ్వాలి

- ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు

వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:

పెద్దమందడి మండల కేంద్రంలో మంగళవారం ఎం ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కోమ్ము చెన్న కేశవులు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ ల వర్గీకరణ చట్టబద్ధ సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నగారు మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాల పై ఉద్యమాలు పోరాటాలు చేయడం జరుగుతుంది. కానీ సుప్రీంకోర్టు ఆగస్టు ఒకటో తారీకు నాడు ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చని హామీ ఇవ్వడం జరిగింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంఎస్సీ లో ఉన్న 59 కులాలకు ఏబిసిడి వర్గీకరణ చేస్తాం కొత్త పాత ఉద్యోగ నోటిఫికేషన్లలో రిజర్వేషన్లు కల్పిస్తాం.ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి విద్య ఉద్యోగ సాంఘిక సంక్షేమ రంగాలలోమాదిగ మాది ఉపకులాల విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా ఎస్సీ వర్గీకరణ అంశం గురించి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వంఎస్సీ వర్గీకరణ విషయంలో జాప్యం చేయడం సిగ్గుచేటుగా భావిస్తున్నాం మాదిగల పైన ప్రేమ ఉంటే చిత్తశుద్ధితోటి ఎస్సీ వర్గీకరణ చేసి ఎస్సీ లో ఉన్న 59 కులాలకు రిజర్వేషన్లు ఏబిసిడి వర్గీకరణ చేసిఅన్ని రంగాలలో కూడా జనాభా దామాశిక ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో తదనంతరం

**ఎం ఎస్ ఎఫ్ కళాశాల కమిటీ**

అధికార ప్రతినిధి హేమంత్ మాదిగ, ప్రధాన కార్యదర్శి నందిని మాదిగ,ఉపాధ్యక్షులుకీర్తన మాదిగ, కార్యదర్శి ప్రశాంత్ మాదిగ,కార్యవర్గ సభ్యులు ప్రసాద్ మాదిగ,తేజ రామ్ మాదిగ,శివకుమార్ మాదిగ, మనిషి మాదిగ,తులసి మాదిగ మరియు మాదిగ ఉపకులాల విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

అధ్యక్షులు భాను మాదిగ,



## కాంగ్రెస్ వైఫల్యాలపై
# బీజేపీ ఛార్జ్‌షీట్ విడుదల

వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:

వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ నేతృత్వంలో రత్న హోటల్ వేదికగా బీజేపీ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల పై ఛార్జ్‌షీట్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల గారడీని నిర్దాక్షిణ్యంగా వెలికితీస్తూ, వారి 6 గ్యారంటీలను 66 మోసాలు, 420 హామీలుగా అభివర్ణించారు.

కాంగ్రెస్ హామీలపై విమర్శలు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ అనేక వాగ్దానాలు చేసింది కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని అరూరి రమేష్ తెలిపారు. ప్రజల తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బీజేపీ పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చేరవేసి, తెలంగాణలో బీజేపీ బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగడమే తమ ప్రధాన లక్ష్యమని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, పాదయాత్ర ప్రముఖ్ రత్నం సతీష్ షా, వర్ధన్నపేట అసెంబ్లీ ప్రముఖ్ బన్న ప్రభాకర్, నర్సంపేట ఎమ్మెల్యే కంటెస్టెంట్ పాపారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు జలగం రంజిత్, రాణా ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## పుష్ప2 సినిమా
# విడుదలను ఆపాలంటూ పిటిషన్...

హైదారాబాద్, తెలంగాణ ముచ్చట్లు

పుష్ప2 సినిమా విడుదలను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో తీసిన ఈ సినిమా విడుదల కాకుండా ఆపాలని సారారపు శ్రీశైలం అనే అతను రిట్ దాఖలు చేశారు. ఈ సినిమా స్మగ్లింగ్‌ను ప్రోత్సహించేలా ఉందని అందులో పేర్కొన్నారు.ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్య కొట్టివేశారు. సెన్సార్ బోర్డ్ తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపించారు. మార్పులు సూచించిన తర్వాతే సినిమా విడుదలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.ఊహాజనిత ఆరోపణల ఆధారంగా సినిమా విడుదలను నిలిపివేయలేమని హైకోర్టు తేల్చి



చెప్పింది. కోర్టు సమయం వృథా చేసినందుకు గాను పిటిషనర్‌కు జరిమానా విధించింది. ఈ జరిమానాను అక్రమ రవాణాకు గురైన మహిళా బాధితులకు, పిల్లల సంక్షేమం కోసం పాటుపడే సంస్థలకు అందజేయాలని ఆదేశించింది.

# ఖమ్మంలో సెలబ్రిటీ ఫ్యామిలీ సెలూన్ ను ప్రారంభించిన డాక్టర్ తుమ్మల యుగంధర్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

మగువల అందానికి ప్రతిరూపం,& యువకుల హెయిర్ స్టైల్ ను కూడా అందంగా చూపడంలో కేరాఫ్ బ్యూటీ సెలూన్లు కేరాఫ్ అడ్రస్ గా నిలిచాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ అన్నారు. ఖమ్మం నగరంలోని మమత రోడ్ ప్రాంతంలో ఆహా ఏమి రుచి ఫ్యామిలీ రెస్టారెంట్ చెంతన నూతన సెలబ్రిటీ లగ్జరీ ఫ్యామిలి సెలూన్ ను మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ ప్రారంభించి మాట్లాడారు. సాంబశివరావు హోటల్ బిజినెస్ లో స్థిరపడి వున్నప్పటికీ బ్యూటి సెలూన్ రంగంలోకి అడుగుపెట్టిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ రంగంలో కూడా సాంబశివరావు రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుతం అందానికి తుది మెరుగులు దిద్దడంలోనూ.. శుభకార్యాలకు ముస్తాబు చేయడంలోనూ..ఈబ్యూటి సెలూన్లు ఎంతగానో ఉపయోగ పడతాయని ఆయన అన్నారు. మెట్రోపాలిటన్ నగరాలకు ధీటుగా ఖమ్మం నగరం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందని ఆయన అన్నారు..మనిషి అవసరాలకు అనుగుణంగా కూడా ఖమ్మం నగరం ఇటు వస్త్ర వ్యాపార రంగంలోను, రెస్టారెంట్లు, జిమ్, బ్యూటి సెలూన్ల విభాగంలోనూ హైద్రాబాద్ నగరానికి ఏమాత్రం తీసిపోకుండా ఖమ్మం నగరం పోటీపడుతుందని అన్నారు. అనంతరం సెలూన్ అధినేత డాక్టర్ తుమ్మల యుగంధర్ కు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు సరిపూడి రమాదేవి, సతీష్, మిక్కిలినేని నరేందర్, సెలూన్ అధినేత కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు..



# పారిశుద్ధ్య కార్మికుల పనితీరు ప్రశంసనీయం

- ప్రజా ఆరోగ్యాలను కాపాడడంలో పారిశుద్ధ్య కార్మికులదే కీలకపాత్ర

**వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:**

కార్మికులను గౌరవిద్దాం కష్టాల్లో అండగా నిలబడదామని,పట్టణాలలో, పల్లెల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసే కార్మికులందరి సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు.వారు అపరిశుభ్రంగా మారి పట్టణాలను, పల్లెలను శుభ్రంగా ఉంచుతున్నారని అటువంటి పారిశుద్ధ్య కార్మికులను మనం ఎల్లవేళలా గౌరవించుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి సూచించారు. ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం వనపర్తి పట్టణంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన అర్బన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో పూలమాలతో సత్కరించారు.పారిశుద్ధ కార్మికులు చేసే సేవ ఎనలేనిదని పారిశుద్ధ్య కార్మికులందరినీ గుండెల్లో పెట్టి చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే అన్నారు.ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని మహిళా సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని ప్రతి కార్యక్రమంలోనూ మహిళలను భాగస్వామ్యం చేస్తూ ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్ గాంగ్వర్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, వనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# భూమి, కులాంతర వివాహం కోసమే చంపేశారు

**తెలంగాణ ముచ్చట్లు:**

రంగారెడ్డి జిల్లాలో కానిస్టేబుల్ నాగమణి హత్యకేసులో నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ఆమె సోదరుడైన పరమేశ్‌ను నిందితుడిగా గుర్తించి అతని నుంచి హత్యకు వినియోగించిన కత్తి, ఓ కారును, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కులాంతర వివాహం సహా ఎకరం భూమి విషయంలోనే నాగమణిని హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు పరమేశ్‌కు హైమావతి, నాగమణి ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. హైమావతికి 2009లో వివాహం జరిగింది.నాగమణికి 2014లో పటేల్ గూడకి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. వివాహం సమయంలో నాగమణికి ఎకరం భూమిని కట్నంగా ఇచ్చారు. కానీ కుటుంబ కలహాలతో భర్త నుంచి దూరంగా వచ్చేసిన నాగమణి హయత్‌నగర్ హాస్టల్‌లో ఉండి చదువు పూర్తి చేసి 2020లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. మొదటి భర్త నుంచి ఆమెకు 2022లో విడాకులు లభించాయి. అయితే కొన్నేళ్లుగా రాయప్రోలు గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తిని ప్రేమించింది.కులాంతర వివాహమే కారణమా? : విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెకు వారి కులానికి సంబంధించిన వ్యక్తితోనే వివాహంచేసేందుకు ప్రయత్నించారు. కానీ తన వ్యక్తిగత జీవితానికి అడ్డువస్తున్నారని తనకు ఇచ్చిన ఎకరం భూమిని సైతం నాగమణి తిరిగి పరమేశ్‌కు ఇచ్చేసింది. 15రోజుల క్రితం శ్రీకాంత్‌ను వివాహం చేసుకుని వనస్థలిపురంలో నివాసముండేది. కొద్ది రోజులుగా తిరిగి తన భూమి తనకు ఇవ్వమని పరమేశ్‌పై ఒత్తిడి తేవడం, సోదరి కులాంతర వివాహం నచ్చని పరమేశ్ ఆమెపై కక్ష పెంచుకుని ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.గత నెల 30వ తేదీన భర్తతో కలిసి నాగమణి రాయప్రోలు గ్రామానికి రాగా హతమార్చడనికి ఇదే అదునుగా పరమేశ్ భావించాడు. సోమవారం(డిసెంబర్ 02)న ఉదయం రాయప్రోలు నుంచి ద్విచక్ర వాహనంపై హయత్‌నగర్ ఠాణాలో విధులకు వెళ్తున్న నాగమణిని వెంబడించాడు. కారుతో వెనుక నుంచి ఢీకొట్టి రోడ్డుపై జనసంచారం లేకపోవడంతో కత్తితో దాడి చేసి పరారయ్యాడు. భర్త శ్రీకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న పరమేశ్‌ను పొల్కంపల్లి గ్రామ సమీపంలో అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించారు

# వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లిలో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమం కోసం తన సహకారాన్ని అందించడమే కాకుండా వారికి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, "వికలాంగుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇచ్చి, గౌరవాన్ని కల్పించే విధంగా చర్యలు చేపడతాను. మీ సమస్యల పరిష్కారం కోసం రెండు నెలల్లో కఠిన చర్యలు తీసుకుంటాను," అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ జన్ను శీభారాణి, అనిల్ కుమార్, మండల అధ్యక్షుడు జన్ను సుధాకర్, బుద్దే పెద్దన్న, జన్ను అభిషేకం, అరుణకర్, గాదె రాము, మైనార్టీ నాయకులు అంజత్, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు అఖిల్, ఇతర స్థానిక నాయకులు, వికలాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.







# కొందరు ఇబ్బంది పడినా కఠిన నిర్ణయాలు తప్పవు

**హైదారాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

జియో సైన్స్ ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. పారిశ్రామిక రంగాలతో పాటు ప్రభుత్వాలకు ఈ జియో స్పేషియల్ టెక్నాలజీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన 'జియో స్మార్ట్ ఇండియా' రెండో సదస్సులో ఆయన మాట్లాడారు. శాటిలైట్ మ్యాప్ డేటా బేస్ ద్వారా చెరువులను గుర్తించి హైడ్రా వాటిని కాపాడుతుందని తెలిపారు. మ్యాప్ ద్వారా ఆక్రమణలను గుర్తించి తొలగిస్తున్నామని చెప్పారు. నగరంలో చెరువుల సంరక్షణ కోసం కొంత మందికి ఇబ్బంది అయినా కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. నాళాలు ఆక్రమణకు గురై వాటి మధ్య ఇంటర్ కనెక్టివిటీ పోయి వ్యర్థ జలాలు చెరువులలో కలుస్తున్నాయన్నారు. జియో స్పేషియల్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగమని తెలిపారు.

# శబరిమల వెళ్లే భక్తులకు రైల్వే కీలక విజ్ఞప్తి

శబరిమలకు వెళ్లే భక్తులకు దక్షిణ మధ్య రైల్వే కీలక సూచనలు చేసింది. రైళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని, కర్పూరం వెలిగించవద్దని విజ్ఞప్తి చేసింది. ప్రయాణికుల రైళ్ల కోచ్‌ల లోపల పూజా విధానంలో భాగంగా కర్పూరం వెలిగించడం, అగరబత్తులు, హారతి ఇవ్వడం, సాంబ్రాణి పుల్లలు వెలిగించడం వంటివి చేస్తున్నట్టు రైల్వే అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిపింది. ఇలాంటి కార్యక్రమాలు ట్రైయిన్‌లో చేయవద్దని యాత్రికులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది.పూజా కార్యక్రమాలపై నిషేధం : ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే(SCR) శబరిమలకు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్లు జోన్‌లోని సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్, తిరుపతి, కాకినాడ, నాందేడ్ తదితర స్టేషన్ల నుంచి బయలుదేరి మార్గమధ్యలో పలు స్టేషన్లలో ఆగుతాయి. ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణించే వారు సురక్షితంగా గమ్య స్థానాలకు చేరేందుకు రైల్వే శాఖ ప్రయాణికుల సహకారం కోరుతుంది. రైళ్లలో, రైల్వే స్టేషన్ ప్రాంగణాలలో ఎలాంటి పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని విజ్ఞప్తి చేసింది. మండే స్వభావంగల పదార్థాలతో ప్రయాణం చేయడం, వాటిని ఏ రూపంలోనైనా వెలిగించే చర్యల పట్ల నిషేధం విధించినట్లు రైల్వే శాఖ వెల్లడించింది.రైల్వే చట్టం ప్రకారం నేరం : మండే స్వభావం గల పదార్థాలు అగ్ని ప్రమాదాలకు దారితీసి, మానవ ప్రాణాలకు ముప్పు కలిగించడమే కాకుండా రైల్వే ఆస్తులకు సైతం నష్టం కలిగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు రైల్వే చట్టం 1989లోని సెక్షన్లు 67, 154, 164, 165 ప్రకారం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడతాయని స్పష్టం చేసింది. ఇటువంటి చర్యల వల్ల జరిగిన నష్టానికి బాధ్యత వహించడంతో పాటు, 3 సంవత్సరాల జైలు శిక్ష లేదంటే జరిమానా లేదా రెండూ ఒకేసారి విధించే అవకాశముందని అధికారులు తెలిపారు.తెలంగాణ నుంచి కాచిగూడ కొట్టాయం మధ్య డిసెంబర్ 5 నుంచి 27 వరకు ప్రతి గురు, శుక్రవారాల్లో ఈ ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగించనున్నాయి. కాచిగూడ కొట్టాయం (07133) రైలు డిసెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో (ప్రతి గురువారం) మధ్యాహ్నం 3 గంటల 40 నిమిషాలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో బయల్దేరి శుక్రవారం సాయంత్రం 6 గంటల 50 నిమిషాలకు కేరళలోని కొట్టాయం చేరుకోనుంది.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**

వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మరోసారి తన మాట నిలబెట్టుకున్నారు. అరెపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే సొసైటీ విద్యాలయాన్ని గతంలో తనిఖీ చేసిన సందర్భంగా విద్యార్థుల డైనింగ్ హాల్లో ఎదురైన సమస్యలను చూశాక, విద్యార్థులు అడిగిన ఫ్యాన్స్, క్రీడా సామగ్రి కొరతను తీర్చుతానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, మంగళవారం ఆ హామీని అమలు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ జన్ను శీభారాణి, అనిల్ కుమార్, మండల అధ్యక్షుడు జన్ను సుధాకర్, బుద్దే పెద్దన్న, జన్ను అభిషేకం, అరుణకర్, గాదె రాము, మైనార్టీ నాయకులు అంజత్, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.





**ఫ్యాన్స్, క్రీడా సామగ్రి అందజేత:**

ఎమ్మెల్యే నాగరాజు తన సొంత నిధుల ద్వారా ఫ్యాన్స్ మరియు క్రీడా సామగ్రిని అందజేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల ఆనందాన్ని పంచుకుంటూ, వారి అభ్యర్థనలకు తగిన స్పందన చూపారు.

**ఆడిట్ మరియు సూచనలు:**

అనంతరం ఆఫీస్ రూమ్‌లో రికార్డులను, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించిన ఎమ్మెల్యే, నిల్వ ఆహార పదార్థాల నాణ్యతపై పరిశీలన చేసి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



**ప్రతిభ కలిగిన విద్యార్థుల పట్ల ప్రోత్సాహం:**

"విద్యార్థులకు అవసరమైన సహాయాలను నా వంతు సొంత నిధుల ద్వారా అందిస్తాను. ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను," అని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు.

# దివ్యాంగులకు అండగా ఉంటా

- అంగవైకల్యం దేనికి అడ్డు కాకూడదు
- సమాజంలో వారు అందరితో సమానమే
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి.

**వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:**




వనపర్తి నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులందరికీ తాను ఎల్లవేళలా అండగా ఉంటానని ఎవరు అధైర్య పడకూడదని సమాజంలో దివ్యాంగులు సైతం అందరితో సమానంగా ఉండాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పిలుపునిచ్చారు.మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు మంజూరు చేస్తామన్న 6000 పెన్షన్ ను ప్రభుత్వం త్వరలోనే మంజూరు చేస్తుందన్నారు. గతంలో వైయస్సార్ హయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం వనపర్తిలో దివ్యాంగులకు ప్రత్యేక భవన నిర్మాణానికి జిల్లా వైద్య కళాశాల పక్కన స్థలం కేటాయిస్తూ ప్రొసిడింగ్ ఇస్తున్నామని త్వరలోనే భవన నిర్మాణం కావలసిన ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.దివ్యాంగులలోను కొందరికి ఇల్లు ఉండి ఉంటాయని ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.వీల్ చైర్ ఎలక్ట్రికల్ స్కూటీలు అవసరం ఉన్న వారందరికీ సైతం వాటిని మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.దివ్యాంగులూ ఎందులోనూ తీసిపోరని రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో వాడు సైతం పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ చేపట్టే సర్వే ప్రకారం విజయవకాశాలున్న ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ బీఫామ్ అందజేస్తామని ఎమ్మెల్యే వారిని ప్రోత్సహించారు.ఈనెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వనపర్తికి వస్తున్నారని ఈ సందర్భంగా మన పార్లమెంట్ సభ్యులు మల్లురవి గారి సారధ్యంలో అన్ని రకాల ఉపాధి అవకాశాలకు సంబంధించిన ఉద్యోగమేలను నిర్వహిస్తున్నామని అందులోనూ అర్హత గల దివ్యాంగులు అందరూ దరఖాస్తులు చేసుకోవచ్చని ఎలాంటి అనుమానాలు ఉన్న స్థానికంగా ఉండే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీరు మీ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు.వనపర్తి నియోజకవర్గం లో స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కేంద్రాన్ని సైతం త్వరలోనే ప్రారంభించనున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్ గాంగ్వర్,డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్,జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, దివ్యాంగుల జిల్లా అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రజాపాలన విజయోత్సవంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

జనగామ జిల్లా పాలకుర్తి మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.ఈ వేడుక సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, తనకు మద్దతు ఇచ్చి విశ్వాసం ఉంచిన పాలకుర్తి నియోజకవర్గ ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమమే తన ముఖ్య ఉద్దేశమని, పార్టీ శ్రేణులతో కలిసి సమష్టిగా మరింతగా సేవలందించడానికి కట్టుబడి ఉన్నామని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణతో పాటు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరగాని కుమార స్వామి, ధరావత్ సురేష్ నాయక్, నల్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయోత్సవ వేడుకలను మరింత ఘనత చేశారు.పార్టీ శ్రేణులు ప్రజల ఆశయాల సాధనలో ముందుండి పనిచేస్తామని ఈ సందర్భంగా నాయకులు హామీ ఇచ్చారు.



## తెలంగాణలో నీటిపారుదల అభివృద్ధికి కేంద్రం సహకరించాలి..

- లోక్ సభలో ప్రస్తావించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితేనే అభివృద్ధి సాధ్యమనే ఉద్దేశంతో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని.. ఇక్కడ ప్రధాన సాగునీటి వనరుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి కోరారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా.. 377 నిబంధన ద్వారా లోక్ సభ జీరో అవర్ లో కేంద్ర సాయం ఆవశ్యకతపై మంగళవారం ప్రస్తావించారు. తెలంగాణలో రెండు ప్రధాన నదులు, కృష్ణా మరియు గోదావరి ప్రవహిస్తున్నప్పటికీ.. సాగు అవసరాలకు చాలట్లేదని తెలిపారు. దీనికి కారణం.. వ్యవసాయ భూమి నది మట్టానికి 200300 మీటర్ల ఎత్తులో ఉండడమేనని ఎంపీ పేర్కొన్నారు. ప్రధాన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు అవసరమని, తాగునీరు, మరియు నీటిపారుదల సౌకర్యాల కొరత ఈ ప్రాంతంలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. 20042014 హయాంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో..ఈ సమస్యలను పరిష్కరించడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి, మహాత్మా జోతిబా పూలే దుమ్ముగూడెం టెయిల్ పాండ్ స్కీమ్, జవహర్‌లాల్ నెహ్రూ నెట్టంపాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ మరియు ఇతర ప్రాజెక్టులను ప్రారంభించిందని ఎంపీ రఘురాం రెడ్డి వివరించారు. అయితే.. తెలంగాణ ఏర్పడ్డాక.. గత బీఆర్ ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టులను రీ డిజైన్ పేరుతో పూర్తి చేయలేక పోయిందని తెలిపారు. తెలంగాణ రైతుల సంక్షేమం కోసం సత్వర నీటిపారుదల ప్రయోజనాల కార్యక్రమానికి (AIBP) ప్రధాన్ మంత్రి కృషి సించాయీ యోజన (PMKSY) ద్వారా అవసరమైన అనుమతులు, ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని ఈ కేంద్ర ఆర్థిక శాఖ, జల శక్తి మంత్రివర్యులకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి విజ్ఞప్తి చేశారు.



## ప్రజల తరుపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం

- తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ఛార్జ్‌షీట్ విడుదల

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి,బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండె విజయరామారావు మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చినప్పటికీ హామీల అమలులో ఘోరంగా విఫలమైందని అన్నారు.ఈ సందర్భంగా గుండె విజయరామారావు మాట్లాడుతూ, "కాంగ్రెస్ గ్యారంటీల గారడీ 6 అబద్ధాలు, 66 మోసాల తాలుకా కథ. ప్రజలకు ఇచ్చిన సుమారు 420 హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది" అని విమర్శించారు.ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం ప్రజల హక్కులను కాపాడేందుకు, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం స్పందించేందుకు బీజేపీ పోరాటాన్ని ఉధృతం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ ఇనుగల్ యుగంధర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, స్టేషన్ ఘనపూర్ బీజేపీ అధ్యక్షుడు చట్ల వెంకటరమణ గౌడ్, బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షులు బాలినేని శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు కందుకూరి రజినీకాంత్, బీజేవైఎం నాయకులు రాజేష్ రెడ్డి పాల్గొన్నారు.

## అమ్మో - ఎంత పే.....ద్ద కొండ చిలువో

**తెలంగాణ ముచ్చట్లు:**

మనం గ్రామాలలో చెట్లు దట్టంగా ఉన్న ప్రదేశాలల్లో పాములు ఉండడం సహజం. అడవి, దట్టమైన చెట్లు ఉన్న చోటే వాటి నివాసం. కానీ అవి మనం ఉన్న చోటే ఉంటే ఎలా ఉంటుంది. ఊహించుకుంటానే శరీరంలో గుబులు పుడుతోంది కదా. మనం తిరిగే ప్రదేశాల్లో కాకుండా ఏకంగా ఇంట్లో, వాష్‌రూంలో, వాషింగ్ మెషిన్‌లో, బైక్‌లోనూ ఉంటే ఎవరికైనా వామ్మో అని భయంగా ఉంటుంది. అవును మీరు భయపడినా ఇంట్లోనూ, బాత్‌రూంలో ఆఖరికి బైక్‌లో కొండచిలువ ఉన్న సందర్భాలు చాలా ఉన్నాయి. ఇలాంటి ఘటనలు జరిగిన చోట అక్కడున్న వ్యక్తులు భయాందోళనకు గురికావడం పక్కా. ఇలాంటి ఘటనే కొందరు స్థానికులను నిజామాబాద్ జిల్లాలో భయపెట్టింది.

**ఏకంగా పదిహేను అడుగులు :**

నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం మైలారం శివారులో స్థానికులకు ఓ భారీ కొండచిలువ కనిపించింది. దాని పొడవు సుమారుగా పదిహేను అడుగులు ఉంది. దీంతో భయాందోళనకు గురైన



స్థానికులు నిజామాబాద్ పట్టణానికి చెందిన స్నేక్ క్యాచర్(పాములు పట్టే వ్యక్తి) మల్లేశ్‌కు సమాచారమిచ్చారు. ఆయన వెంటనే కొండ చిలువ ఉన్న ప్రాంతానికి చేరుకుని సుమారు గంటపాటు శ్రమించి దాన్ని పట్టుకున్నారు. పదిహేను అడుగుల పొడవు ఉన్న ఈ పామును సురక్షితంగా దగ్గరలోని దట్టమైన అడవి ప్రాంతంలో వదిలిపెట్టారు.

## అట్టహాసంగా జరిగిన పట్టణ దినోత్సవ విజయోత్సవాలు

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

అబ్బురపర్చిన నృత్య రూపక కళా ప్రదర్శనలు కాళోజీ కళాక్షేత్రంలో వైభవంగా జరిగిన ప్రజా పాలన విజయోత్సవాలు.జిడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టణ దినోత్సవ వేడుకలు మంగళవారం కాళోజీ కళాక్షేత్రంలో అట్టహాసంగా జరిగాయి. ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు.

**జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభం**

గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడే, కార్పొరేటర్ రావుల కోమల వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

**సాంస్కృతిక ప్రదర్శనల ఆకర్షణ**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ మహిళలు, చిన్నారులు, విద్యార్థులు నిర్వహించిన కోలాటం, కూచిపూడి, జానపద నృత్యాలు, అన్నమాచార్య సంకీర్తనలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

**బ్యాంక్ లింకేజే చెక్కుల పంపిణీ**

విధి వ్యాపారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, ఇందిరా మహిళ శక్తి నిర్వాహకులకు రూ. 8.79 కోట్ల విలువైన బ్యాంక్ లింకేజే చెక్కులను మేయర్, కుడా చైర్మన్, కమిషనర్ అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులు, డి.ఆర్.ఎఫ్ సిబ్బంది, మెప్మా సిబ్బంది వంటి వారిని శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉత్తమ ప్రదర్శనలలో విజేతలకు కూడా ప్రత్యేక బహుమతులు అందజేశారు.వరంగల్ జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన పాటలు, ప్రదర్శనలు కళాక్షేత్రాన్ని ప్రాణం పోసాయి. కళాభిమానులు పెద్ద ఎత్తున హాజరై వేడుకలను మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.ఈ కార్యక్రమంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, హన్మకొండ డిఆర్ఓ గణేష్, డిఆర్డీఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.











## అవినీతిని తరిమేద్దాం, దేశాభ్యుదయానికి పునాదులు వేద్దాం

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రజలకు అవినీతి నిరోధక సందేశాన్ని పంపారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగినప్పుడు అది ఇవ్వకుండా, వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకుని హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఏసీబీ కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు. ప్రజల సహకారంతో జిల్లాను అవినీతి రహితంగా మారుస్తామని, అవినీతి వ్యతిరేక చర్యల్లో భాగస్వాములవ్వాలని ఆమె పిలుపునిచ్చారు.అవినీతి రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలని, నైతిక విలువలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య పాల్గొని అవినీతి వ్యతిరేక చర్యలపై అవగాహన కల్పించారు.



## పాలేరుకు తీపి కబురు...!

- మంత్రి పొంగులేటి చొరవతో జే ఎన్ టీ యూ నూతన భవన నిర్మాణానికి రూ. 108 కోట్ల రూపాయల నిధుల విడుదల
- జీవో విడుదల చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ బి. వెంకటేశం

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

పాలేరు ప్రజలకు తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరో తీపి కబురును అందించారు. ఆయన చొరవతో ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామంలో జే ఎన్ టీ యూ నూతన భవన నిర్మాణానికి రూ. 108 కోట్ల 60 లక్షల రూపాయల నిధుల విడుదల చేస్తూ తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం మూడు రోజుల రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. పాలేరు ఎమ్మెల్యేగా పొంగులేటి గెలిచి మంత్రి అయ్యి ఏడాది తిరగక ముందే ఈ జీవో వెలువడటం విశేషం. తొలి ఏడాదిలోనే నియోజకవర్గానికి కావాల్సిన అన్ని వసతులను సమకూరుస్తూ రావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, పర్యాటకం తదితర రంగాల్లో అన్ని నియోజకవర్గాల్లో కెల్లా పాలేరు నియోజక వర్గాన్ని అగ్రగామిగా నిలుపుతూ వస్తున్నారు. ఇదే తరుణంలో గత ప్రభుత్వంలో ఏళ్లుగా కలగా ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థుల కలను సాకారం చేస్తూ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం పట్ల పాలేరు ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## మందా కృష్ణా మాలలపై నీ పద్ధతి ఇకనైనా మార్చుకో...

- లేకుంటే నీ జాతే నీకు గుణపాఠం చెప్పతాది.
- ఐ ఎమ్ ఎల్ ఏ ప్రధాన కార్యదర్శి మర్రి. ప్రకాష్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం నగరం లో ఇమ్లా ప్రధాన కార్యదర్శి మర్రి ప్రకాష్ మాట్లాడుతూ ప్రపంచంలో నే అత్యంత మేధావి (నాలెడ్జి అఫ్ థి వరల్డ్) పేరు గాంచి ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం అయిన భారత రాజ్యాంగాన్ని కమిటీ సభ్యులు ఎక్కడెక్కడో ఉంటూ సహకారం అందించకున్నా ఒంటి చేత్తో రాసిన డా బీ ఆర్ అంబేద్కర్ ని ఏకవచనంతో సంభోదిస్తూ.. ముప్పది ఏండ్లు గా ఒక్కో ఎన్నికలప్పుడు ఒక్కో పార్టీకి అనుకూలంగా నీవు మద్దతిస్తూ నీ కులపోట్లను తాకట్టు పెట్టే నీకు..

ఎన్నెన్నో పరిశ్రమలు పెడుతూ వాటిలో దళితులకు వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించి హైదరాబాద్ నగరం లో స్లం ఏరియాలోని దళితులకు 70 వేల నివాస గృహాలు ఏర్పాటు చేసిన గుడిసెల వెంకటస్వామి గా పేరు గాంచిన మా మాలల ఆత్మస్థైర్యం మా మాలల రాష్ట్ర నాయకుడు దళితుల ఆశాజ్యోతి పారిశ్రామిక వేత్త అయిన డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చెన్నూరు ఎమ్ ఎల్ ఎ పై... మనువాదుల పంచన చేరి వాళ్ళ కాళ్ళు పట్టుకుంటూ 30 ఏండ్లుగా తిరిగే నీవు ఏ ఎండ కా గొడుగు పట్టే నీవు వివేక్ పై మాలలపై అంబేద్కర్ పై అవాకులు చెవాకులు పేలితే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుంది.. మందా కృష్ణమాదిగ గుర్తు పెట్టుకో.. ఎస్సీ జనాబా పెరిగిన దానికి అనుగుణంగా ఎస్సీ రిసర్వేషన్ శాతన్ని 15% నుండి 20% నికి పెంచాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించాలి అని, ఎస్సి ఎస్టీ ప్రభుత్వ రంగంలో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని చేసే పోరాటాలకు చేతనైతే మాతో కలసి రా.. అసలు మనువాది ఎవరో మానవత్వం ఉన్న వారెవరో ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.మాటిమాటికి మనువాదులు అంటూ మనువాద పార్టీలతో అంటకాగే నీవు మనువా దివి మనువాదుల మనుస్మృతి ని తగలపెట్టిన అంబేద్కర్ వారసులం మేము మనువాదులపై పోరాడిన చరిత్ర మా అయ్య అంబేద్కర్ వారసత్వం పునికి పుచ్చుకొన్న చరిత్ర మాది అని అన్నారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
బుధవారం 04 –12 –2024





# నేను ఆ బ్యాచ్ కాదు..

'సవ్యసాచి', 'మిస్టర్ మజ్ను' తదితర చిత్రాలతో అలరించిన హీరోయిన్ నిధి అగర్వాల్ ఈ భామ అగ్ర నటుడు పవన్ కల్యాణ్ సరసన నటించే అవకాశం దక్కించుకున్న సంగతి తెలిసిందే. అదే 'హరిహర వీరమల్లు' ఈ సినిమాతోపాటు ప్రభాస్ సరసన 'ది రాజాసాబ్' లోనూ నటిస్తున్నారు. తాజాగా 'ఎక్స్' వేదికగా అభిమానులతో ముచ్చటించారు. ఈ క్రమంలో.. 'మీకు తెలుగు వచ్చా మేడమ్?' అని ఓ నెటిజన్ అడగ్గా ఆమె స్పందించారు. 'వస్తుందండీ.. ఎందుకు సందేహం? 'అందరికీ నమస్కారం' అని చెప్పే బ్యాచ్ కాదు నేను' అని సమాధానమిచ్చారు.



# 'పుష్ప2'.. విడుదలకు ముందు మరో ట్విస్ట్..

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న 'పుష్ప2: ది రూల్' మూవీని ప్రపంచవ్యాప్తంగా 12వేలకు పైగా స్క్రీన్‌లలో వివిధ ఫార్మాట్‌లలో విడుదల చేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. అయితే, ప్రస్తుతానికి 3D వెర్షన్‌ను విడుదల చేయటం లేదట. మూవీని 3డీ వెర్షన్‌కు అనుగుణంగా షూట్ చేసినప్పటికీ అందుకు సంబంధించిన పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రస్తుతానికి అన్ని థియేటర్స్‌లోనూ 2డీ వెర్షన్‌ను మాత్రమే అందుబాటులోకి తెస్తున్నారని, సినీ విశ్లేషకుడు తరుణ్ ఆదర్శ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఇప్పటికే 3డీ వెర్షన్‌లో చూద్దామని టికెట్స్ బుక్ చేసుకుంటే, ఆ షో క్యాన్సిల్ అయ్యే అవకాశం ఉంది. లేదా అదే స్క్రీన్‌లో 2డీ వెర్షన్‌లో సినిమాను ప్రదర్శించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 3డీ వెర్షన్ రావడానికి ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉన్నట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి.సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను మొత్తం ఏడు ఫార్మాట్‌లలో (ఐమ్యాక్స్, డాల్బీ, డిబాక్స్, 4డీఎక్స్, ఐస్, 2డీ, 3డీ) విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అలాగే తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లోనూ అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పటికే 2డీ వెర్షన్‌కు సంబంధించిన ప్రింట్ దాదాపు సిద్ధమైంది. థియేటర్ వెర్షన్‌కు ఒకటికి రెండుసార్లు వేసి చూసుకుంటున్నారు. ఏవైనా చిన్న చిన్న మార్పు, చేర్పులు ఉంటే ఈరోజు రాత్రిలోపు పూర్తి చేసేయాలని సుకుమార్ టీమ్ గట్టిగానే కష్టపడుతోంది.మరోవైపు బుక్ మై షోలో టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేయగా హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. దీంతో మరో రికార్డు పుష్పరాజ్ సొంతమైంది. బాక్సాఫీస్ వద్ద అత్యంత వేగంగా మిలియన్ టికెట్స్ అమ్ముడైన చిత్రంగా 'పుష్ప2' నిలిచింది. ముఖ్యంగా ఉత్తరాదిలోనూ 'పుష్ప'మేనియా కనిపిస్తోంది.

## sports స్పోర్ట్స్



# రోహిత్ డబుల్ డోస్ ప్రాక్టీస్

ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు దూరంగా ఉన్న కెప్టెన్ రోహిత్ శర్మ.. రెండో టెస్టు ముంగిట ముమ్మరంగా సాధన చేస్తున్నాడు. ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్‌లో విఫలమైన నేపథ్యంలో గులాబి టెస్టు కోసం అతను మిగతా ఆటగాళ్ల కంటే ఎక్కువ సాధన చేస్తున్నాడు. మంగళవారం అడిలైడ్‌లో భారత ఆటగాళ్లు నెట్ సెషన్స్‌లో పాల్గొనగా.. మిగతా వారి కంటే రోహిత్, పంత్ గంట ముందే వచ్చి సాధన ప్రారంభించారు. వీళ్లిద్దరూ ఓ నెట్‌లో సాధన చేస్తుంటే.. పక్కనే ఉన్న మరో మూడు నెట్స్‌లో కోహ్లి-శుభ్‌మన్, జైస్వాల్-రాహుల్, నితీశ్ కుమార్-వాషింగ్టన్ సుందర్ జోడీలు ప్రాక్టీస్ సాగించాయి. మరోవైపు బౌలర్లు కూడా నెట్స్‌లో చెమటోడ్చారు. భారత సాధనను వీక్షించేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రేక్షకులను అనుమతించడంతో స్టేడియం కిటకిటలాడింది.అడిలైడ్: బోర్డర్-గావస్కర్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో భారత ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ధాటికి ఆస్ట్రేలియా బ్యాటర్లు విలవిలలాడిపోయారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అతను కొట్టిన దెబ్బకు కోలుకోలేకపోయిన ఆసీస్.. ఘోర పరాజయం చవిచూసింది. గులాబి బంతితో సాగే రెండో టెస్టు (డే/నైట్)లో బుమ్రా నుంచి ఆసీస్ బ్యాటర్లకు మరింత పెద్ద ముప్పే పొంచి ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే తమ జట్టులో ప్రపంచ స్థాయి బ్యాటర్లున్నారని.. వారు బుమ్రా సమస్యకు సరైన పరిష్కారాలతో వస్తారని ఆసీస్ వికెట్ కీపర్ అలెక్స్ కేరీ ధీమా వ్యక్తం చేశాడు. "బుమ్రా అద్భుతమైన బౌలర్. అతను ఎన్నో ఏళ్లుగా నిలకడగా బౌలింగ్ చేస్తున్నాడు. కానీ మాకు ప్రపంచ స్థాయి బ్యాటర్లున్నారు. వాళ్లు ఎప్పుడు సమస్య ఎదురైనా సరైన పరిష్కారాలతో వస్తారు. తన బౌలింగ్‌ను పరిశీలించా. తొలి రెండు స్పెల్స్‌లో అతణ్ని కాచుకోవాలి. అతను పాత బంతితో బౌలింగ్ చేసే వరకు ఎదురు చూడాలి. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో హెడ్ ఎదురుదాడి చేశాడు. బుమ్రా అనే కాక భారత బౌలర్లందరినీ సమర్థంగా ఎదుర్కోవడానికి మా బ్యాటర్లు మార్గాలు కనుగొంటారని నమ్ముతున్నా. భారత్ తరఫున ఇద్దరు అరంగేట్ర బౌలర్లు కూడా బాగా బౌలింగ్ చేశారు" అని కేరీ అన్నాడు. ఆస్ట్రేలియా డ్రెస్సింగ్ రూంలో విభేదాలు నెలకొన్నాయన్న ప్రచారాన్ని కేరీ ఖండించాడు. తొలి టెస్టు మూడో రోజు ఆట అనంతరం నాలుగో రోజు ఎలా ఆడబోతున్నారని పేసర్ హేజిల్‌వుడ్‌ను అడిగితే.. అది బ్యాటర్లను అడగాలని చెప్పడం చర్చనీయాంశమైంది. తర్వాత గాయం కారణంగా హేజిల్‌వుడ్ రెండో టెస్టుకు దూరం కావడంపై భారత దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ అనుమానాలు వ్యక్తం చేశాడు.



# విరాట్‌కు గాయం?

అంచనాలకు మించిన ఆటతీరుతో భారత జట్టు ఆస్ట్రేలియాలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ఆరంభించింది. తొలి టెస్టులో 295 పరుగుల భారీ తేడాతో కంగారూ జట్టును కంగుతినిపించిన సంగతి తెలిసిందే. అలాగే చాలాకాలంగా ఫామ్ కోల్పోయి విమర్శలు ఎదుర్కొంటున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సైతం 30వ సెంచరీతో అదరగొట్టాడు. దీంతో విమర్శకులకు సమాధానమివ్వడమే కాకుండా, ఆసీస్ జట్టుకు కూడా హెచ్చరికలు పంపినట్టయ్యింది. మరోవైపు ఈనెల 6 నుంచి అడిలైడ్‌లో జరిగే గులాబీ టెస్టుకు భారత జట్టు తమ సన్నాహకాలను ఆరంభించింది. ఇప్పటికే కాన్‌బెర్రాలో జరిగిన వామప్ మ్యాచ్‌లో ఆటగాళ్లకు చక్కటి ప్రాక్టీస్ లభించింది. అలాగే టెస్టు వేదిక అడిలైడ్‌కు చేరుకున్న రోహిత్ సేన మంగళవారం నెట్స్‌లో తీవ్రంగా సాధన చేసింది. అయితే సెషన్ ఆరంభానికి ముందు విరాట్ కోహ్లీ కుడి మోకాలికి వైద్య సిబ్బంది బ్యాండేజి కడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

జోరుగా భారత జట్టు ప్రాక్టీస్అడిలైడ్: అంచనాలకు మించిన ఆటతీరుతో భారత జట్టు ఆస్ట్రేలియాలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ఆరంభించింది. తొలి టెస్టులో 295 పరుగుల భారీ తేడాతో కంగారూ జట్టును కంగుతినిపించిన సంగతి తెలిసిందే. అలాగే చాలాకాలంగా ఫామ్ కోల్పోయి విమర్శలు ఎదుర్కొంటున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సైతం 30వ సెంచరీతో అదరగొట్టాడు. దీంతో విమర్శకులకు సమాధానమివ్వడమే కాకుండా, ఆసీస్ జట్టుకు కూడా హెచ్చరికలు పంపినట్టయ్యింది. మరోవైపు ఈనెల 6 నుంచి అడిలైడ్‌లో జరిగే గులాబీ టెస్టుకు భారత జట్టు తమ సన్నాహకాలను ఆరంభించింది. ఇప్పటికే కాన్‌బెర్రాలో జరిగిన వామప్ మ్యాచ్‌లో ఆటగాళ్లకు చక్కటి ప్రాక్టీస్ లభించింది. అలాగే టెస్టు వేదిక అడిలైడ్‌కు చేరుకున్న రోహిత్ సేన మంగళవారం నెట్స్‌లో తీవ్రంగా సాధన చేసింది. అయితే సెషన్ ఆరంభానికి ముందు విరాట్ కోహ్లీ కుడి మోకాలికి వైద్య సిబ్బంది బ్యాండేజి కడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in